పేకాటలో దొంగనోటు

ఉత్పందించిన ఆటగాడు

ముఠాను పట్టుకున్న పోలీసులు

ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కబోయి..

జైలుపాలు



7

డ్రోన్ సేద్యం.. ఉపాధి మార్గం..

యువకుడి వినూత్న ఆలోచన

డ్రోన్ సాయంతో పంటలకు మందుల పిచికారీ

సమయం, డబ్బు ఆదా అంటున్న నాగమునీంద్ర



6

పల్లె దారి పరుగు

పటిష్టంగా సిమెంట్ రోడ్లు

బురద బాధ తప్పుతుందని

జనం హర్షం



6



మాట్లాడుతున్న కలెక్టర్

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం

పుట్టపర్తిటౌన్, మార్చి4(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలతో ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. 'ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం-ప్రజాభాగస్వామ్యం' కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక సాయి ఆరామం ఫంక్షన్ హాల్‌లో ప్రకృతి వ్యవసాయంపై అధికారులు, రైతులతో కలెక్టర్ జిల్లాస్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. మహిళాసంఘాల ద్వారా కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలన్నారు. జిల్లాలో తక్కువ వర్షపాతం కారణంగా చాలామంది రైతులు పంటలు సాగు చేయకుండా భూములను బీళ్లుగా వదిలేస్తున్నారన్నారు. వారు ప్రకృతి వ్యవసాయంపై మొగ్గుచూపేలా ప్రోత్సహించాలన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలను అధిక ధరలకు అమ్ముకోవచ్చన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, ఉద్యాన శాఖాధికారి చంద్రశేఖర్, డీపీఎం లక్ష్మానాయక్, రైతులు పాల్గొన్నారు.

పకడ్బందీగా పది పరీక్షలు: ఆర్జేడీ



శిక్షణలో మాట్లాడుతున్న డీఈఓ కిష్టప్ప


బుక్కపట్నం, కొత్తచెరువు, మార్చి4(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కడప ఆర్జేడీ శామ్యూల్ అధికారులను ఆదేశించారు. మండలకేంద్రంలోని డైట్ కళాశాలలో మంగళవారం పది పరీక్షలపై జిల్లా చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంట్ అధికారులు, జిల్లా విద్యాధికారులకు శిక్షణ నిర్వహించారు. ఆర్జేడీ మాట్లాడుతూ.. పరీక్షలు సజావుగా జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత జిల్లా విద్యాధికారులపై ఉంటుందన్నారు. పరీక్షల సమయంలో చుట్టుపక్కల జిరాక్స్ కేంద్రాలు, బుక్ సెంటర్లు మూసి వేయించాలని సూచించారు. కార్యక్రమంలో డీఈఓ కిష్టప్ప, పరీక్షల విభాగ అసిస్టెంట్ కమిషనర్ లాజర్, అసిస్టెంట్ డైరెక్టర్ రామక్రిష్ణ, డైట్ ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, డిప్యూటీ డీఈఓ పద్మప్రియ, ఎంఈఓలు పాల్గొన్నారు.

ఇంటర్ ఇంగ్లీష్ పరీక్షకు 514 మంది గైర్హాజరు

కొత్తచెరువు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా మంగళవారం నిర్వహించిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఇంగ్లీష్ పరీక్షకు 514 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఐఈఓ రఘునాథరెడ్డి ప్రకటనలో తెలిపారు. 12,162 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాయాల్సి ఉండగా.. 11,749 మంది హాజరయ్యారన్నారు. 413 మంది గైర్హాజరయ్యారన్నారు. ఒకేషనల్ పరీక్ష 1696 మందికిగాను 1595 మంది రాశారు. 101 మంది గైర్హాజరయ్యారని ఆయన తెలిపారు.

ఏం భయం లేదు..!

- ఈ వేసవిలో తాగునీటి గండం తప్పినట్లే..!
- తాగునీటి రిజర్వాయర్లలో నిండుగా జలం
- హంద్రీనీవాతో చెరువులు, రిజర్వాయర్లకు జలకళ
- కూటమి ప్రభుత్వం ముందస్తు చర్యలు



చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్



నిండుగా గొల్లపల్లి రిజర్వాయర్

పుట్టపర్తి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): వేసవి కాలం మొదలైంది. జిల్లాలో తాగునీటి ఎద్దడిని నివారించడమే అధికార యంత్రాంగానికి పెను పెనుసవాల్. అయితే ఈ ఏడాది జిల్లాలోని జలాశయాల్లో సమృద్ధిగా నీరుండటంతో వేసవిలో తాగునీటి సమస్య తలెత్తే అవకాశం ఉండదని అధికారులు చెబుతున్నారు. అయినా ముందస్తు జాగ్రత్తలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలో తాగునీటి అవసరాలు తీర్చేందుకు ఆయా ప్రాంతాల్లో తాగునీటి పథకాలు ఉన్నాయి. ప్రధానంగా భూ ఉపరితల జలశయాలైన చిత్రావతి బ్యాలెన్సింగ్, పీఏబీఆర్‌తోపాటు గొల్లపల్లి రిజర్వాయర్లలో నీటి లభ్యతపైనే జిల్లాలో తాగునీటి ఎద్దడి నివారణ ఆధారపడి ఉంటుంది. గత ఏడాదిలాగా తాగునీటి కష్టాలు తలెత్తకుండా కూటమి ప్రభుత్వం ముందస్తుగా జిల్లాలో ఎక్కడెక్కడ తాగునీటి ఎద్దడి వస్తుందో గుర్తించి, చర్యలు చేపట్టి ప్రతిపాదనలు, ప్రణాళికలు రూపొందించారు. జిల్లావ్యాప్తంగా వేసవిలో తాగునీటి సమస్య వచ్చే గ్రామాలను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గుర్తించి ప్రభుత్వానికి ఇప్పటికే నివేదించారు. తాజాగా హంద్రీనీవాతో జిల్లాలో మూడు రిజర్వాయర్లతోపాటు పలు చెరువులను నీటితో నింపిన నేపథ్యంలో భూగర్భ జలాలు పెరిగి ఈసారి వేసవిలో తాగునీటి ఎద్దడి నుంచి కాస్తా ఉపశమనం లభించే అవకాశం ఉందని భావిస్తున్నారు.


రూ.5.87 కోట్లతో ప్రతిపాదనలు

జిల్లాలో 31మండలాల్లోని పలు గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తే అవకాశం ఉందని గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇప్పటికే గుర్తించి రూ. 5.87 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించారు. జిల్లాలో 284 గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని అందించాలని ప్రణాళిక రూపొందించారు. ప్రధానంగా అమడగూరు, ముదిగుబ్బ, అగళి, మడకశిర, గుడిబండ, రొళ్ల, అమరాపురం, గోరంట్ల, సోమందేపల్లి, రొద్దం, పరిగి, పెనుకొండ నల్లమాడ, ఓడీచెరువు, సీకేపల్లి, ఎన్‌పీకుంట, బత్తలపల్లి, ధర్మవరం, కదిరి, మండలాల్లో పలు గ్రామాల్లో నీటి సమస్య తలెత్తే అవకాశం ఉందని నివేదించారు. 80 గ్రామాల్లో బోరు బావులు మరింత లోతు తవ్వడం, మరమ్మతు పనులు చేసి గ్రామీణ నీటి సమస్య తీరాల్సి ఉందని ఇందుకు రూ. 85 లక్షలు అవసరమని నివేదించారు. ఫిబ్రవరిలో బోర్ల ఫ్లష్ ప్రోగ్రామ్ చేపట్టారు. వేసవిలో ఎండవేడిమిని బట్టి తాగునీటి సమస్య తలెత్తే అవకాశం ఉందని అధికార యంత్రాంగం భావించి చర్యలు చేపట్టింది.

హంద్రీనీవాతో జలకళ

ఉమ్మడి జిల్లాకు శ్రీశైలం జలాశయం నుంచి హంద్రీనీవా ద్వారా ఈ ఏడాది కృష్ణా జలాలు 24 టీఎంసీలు చేరాయి. వీటితో శ్రీసత్యసాయి జిల్లాలో రిజర్వాయర్లతోపాటు 74 చెరువులను నింపారు. రాప్తాడు, పెనుకొండ, పుట్టపర్తి, హిందూపురం, కదిరి నియోజకవర్గాల్లో పలు చెరువుల్లోకి కృష్ణా జలాలు వచ్చాయి. జిల్లాలో గొల్లపల్లి జలాశయం నుంచి మడకశిర ఉపకాలువ కింద చెరువుకు సాగునీటితోపాటు పరిశ్రమలు, పెనుకొండ, హిందూపురం ప్రాంతాలకు తాగునీటిని విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 1.913 టీఎంసీలు కాగా 1.65టీఎంసీలు నీరు నిల్వ ఉంది. ప్రస్తుతం రిజర్వాయర్‌లోకి జీడిపల్లి నుంచి 300 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, మడకశిర ఉపకాలువకు 270 క్యూసెక్కుల ఔట్ ఫ్లో ఉంది. బుక్కపట్నం మండలం మారాల జలాశయం సామర్థ్యం 0.483 టీఎంసీల కాగా ప్రస్తుతం 0.200 టీఎంసీల నిల్వ ఉంది. కదిరి మండలం చెర్లోపల్లి జలాశయం 1.608టీఎంసీలు సామర్థ్యం ఉంటే ప్రస్తుతం 0.598 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఈ మూడు జలాశయాల్లో నీరు ఉండటం వల్ల భూగర్భ జలాలు పెరిగి తాగునీటి పథకాలకు నీటి లభ్యత పెరగనుంది. అదే విధంగా ధర్మవరం, కదిరి, పుట్టపర్తి నియోజకవర్గాలకు తాగునీరు అందించే సత్యసాయి తాగునీటి పథం చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో సామర్థ్యం 9.8 టీఎంసీ కాగా ప్రసుత్తం నీటి నిల్వ 6.3 టీఎంసీలు ఉంది. ఇక హిందూపురం, మడకశిర నియోజక వర్గాలకు తాగునీరు అందించే పీఏబీఆర్‌లో తాగునీరు సమృద్ధిగానే ఉన్నట్లు గ్రామీణ తాగునీటి సరఫరా అధికారులు చెబుతున్నారు

ఉష్ణోగ్రతలు



మంగళవారం

గరిష్టం	36.0
కనిష్టం	23.0



రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సెహరీ
పుట్టపర్తి	6.32 బుధవారం సాయంత్రం	5.13 గురువారం ఉదయం
కదిరి	6.29 బుధవారం సాయంత్రం	5.15 గురువారం ఉదయం
ధర్మవరం	6.32 బుధవారం సాయంత్రం	5.13 గురువారం ఉదయం
హిందూపురం	6.32 బుధవారం సాయంత్రం	5.19 గురువారం ఉదయం
పెనుకొండ	6.32 బుధవారం సాయంత్రం	5.19 గురువారం ఉదయం

ఎక్కువ కేసులు పరిష్కారం కావాలి: ఎస్పీ

పుట్టపర్తి రూరల్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఈ నెల 8న జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా చూడాలని పోలీసు అధికారులను ఎస్పీ రత్న ఆదేశించారు. డీపీఓ నుంచి డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలతో ఆమె మంగళవారం వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. రాజీ కాదగిన క్రిమినల్‌సివిల్, రోడ్డు ప్రమాదాలు కేసులు పరిష్కారమయ్యేలా చూడాలన్నారు.

కలిసికట్టుగా పనిచేద్దాం

జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం



మాట్లాడుతున్న చిలకం మధుసూదన్ రెడ్డి

ధర్మవరం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): జనసేన బలోపేతానికి కలిసికట్టుగా పనిచేయాలని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త చిలకం మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని జనసేన కార్యాలయంలో హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని పార్టీ ఇన్‌చార్జిలు, మండల, పట్టణ అధ్యక్షులతో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఆవిర్భావం నుంచి జనసేన పార్టీ బలోపేతం చెందుతోందన్నారు. పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎంగా ప్రజల అభివృద్ధికి కృషిచేస్తున్నారన్నారు. ఈనెల 14న పిఠాపురంలో జరగబోయే జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలు, నాయకులు లక్షల్లో తరలిరావాలని కోరారు. పవన్ కల్యాణ్ పేరు, జనసేన పార్టీ గురించి కనీవిని ఎరుగని రీతిలో దేశవ్యాప్తంగా చర్చించుకునేలా పిఠాపురంలో సమావేశం జరగాలని అన్నారు. అనంతరం పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

ప్రాణం తీశారు

కళ్లు తెరవక ముందే తల్లిని దూరం చేశారు

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

సూపరింటెండెంట్‌కు బాధితుల ఫిర్యాదు

హిందూపురం అర్బన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): నాన్నా..! అమ్మ ఎక్కడకు పోయింది? అని తన పెద్ద కొడుకు అడుగుతుంటే ఏమని సమాధానం చెప్పాలో తెలియడం లేదని ఆ తండ్రి విలపించాడు. చిన్న కొడుకు తల్లి మొహమైనా చూడకముందే కాటికి పంపారే అని విలపించడం స్థానికులను కలిచివేసింది. ఈ విషాద సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా..

ప్రసవం కోసం వస్తే..

హిందూపురం సూరప్పకట్ట వద్ద నివాసముంటున్న హరి తన భార్య ప్రీతిని డెలివరీ కోసం ఈ నెల 1న స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చాడు. అదే రోజు ఆమె సిజేరియన్ చేశారు. అధిక రక్తస్రావం అవుతుండటంతో అర్ధరాత్రి సమయంలో అనంతపురానికి రెఫర్ చేశారు. అయితే వైద్యురాలు నీరజ నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే అధిక రక్తస్రావం కలిగినట్లు మృతురాలి భర్త ఆరోపించాడు. అనంతపురంలో చికిత్స పొందుతూ ప్రీతి రెండో తేదీన మృతి చెందింది. మృతదేహాన్ని అనంతపురం నుంచి హిందూపురం తీసుకొచ్చి దహన సంస్కారాలు చేశారు. అనంతరం మృతురాలి భర్త మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి సూపరింటెండెంట్ లింగన్నను కలిసి వినతి అందించారు. ఆపరేషన్ అయిన తరువాత వార్డుకు మార్చారని అప్పటి నుంచి అధికంగా రక్తం పోతోందని నర్సులు పలు మార్లు ఫోన్‌లో వైద్యురాలు నీరజకు తెలియజేసినా ఆమే రాలేదన్నారు. పరిస్థితి విషమించిందని చెప్పడంతో అప్పుడు ఆసుపత్రికి వచ్చి పేషంట్‌ను కూడా చూడకుండా అనంతపురం రెఫర్ చేసిందని సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశారు. సర్జన్ లేకుండా ఆపరేషన్ ఎలా చేస్తున్నారని నిలదీశారు. బీపీ ఎక్కువగా ఉందని చెబుతున్నారు. అలాంటప్పుడు సాయంత్రం పూట ఎందుకు ఆపరేషన్ చేశారని, ఉదయం పూట అయితే ఎవరో ఒక డాక్టర్ అందుబాటులో ఉంటారు కదా అని ప్రశ్నించారు. ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే పేదలు ప్రభుత్వ ఆసుపత్రికి రావాలంటేనే జంకుతున్నారన్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేస్తానని చెప్పారు. ఇలాంటి ఘటనలు మరలా పునరావృతం కాకుండా తమ లాంటి పేదలకు న్యాయం జరగాలంటే నిర్లక్ష్యం వహిస్తున్న వైద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

చర్యలు తప్పవు

-డాక్టర్ లింగన్న సూపరింటెండెంట్

వైద్యం అందించే విషయంలో నిర్లక్ష్యం వహిస్తే ఎంతటి వారిపైన అయినా చర్యలు తప్పవు. జరిగిన సంఘటనపై ఉన్నతాధికారులకు వివరించాం. తప్పకుండా విచారణ జరుగుతుంది. మెటర్నల్ డెత్ అంటేనే కలెక్టరు కూడా సీరియస్‌గా పరిగణిస్తారు. విచారణలో నిజానిజాలు నిగ్గుతేల్చి బాధ్యులపై చర్యలు తీసుకుంటారు. అయితే బాధ్యతారహితంగా ఎవరూ ప్రవర్తించకూడదు.


క్లాక్ టవర్ సమీపంలోని షాపింగ్ కాంప్లెక్స్

సొంతం

కొందరి చేతుల్లోనే ఎస్సీ కార్పొరేషన్ దుకాణాలు

ఎస్సీ కార్పొరేషన్ పరిధిలో ఉన్న దుకాణాలు కొందరి కబంధ హస్తాల్లో చిక్కుకున్నాయి. రెండున్నర దశాబ్దాలుగా వాటిలో తిష్ట వేసి, అద్దె కూడా చెల్లించకుండా కాలం గడుపుతున్నారు. ఎవరైనా అధికారులు గట్టిగా అడిగితే కుల సంఘాలు, రాజకీయ నాయకుల పేర్లతో వారిపై తిరగబడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ షాపింగ్ కాంప్లెక్స్ షాపులు కేటాయించే సమయంలో ఎన్నేళ్లకోసారి టెండర్లు నిర్వహించాలి? ఎన్ని సంవత్సరాలు లీజు అనే అంశాలను పొందుపరచక పోవడం వల్లే వారి ఆగడాలు సాగుతున్నట్లు సమాచారం. క్లాక్‌టవర్, కలెక్టరేట్‌లో సమీపంలో ఉన్న కాంప్లెక్స్‌లలో షాపులు దక్కించుకున్న కొందరు సంఘాలను, రాజకీయ పార్టీలను అడ్డుపెట్టుకొని ఐదారు షాపులను వారి వారి కుటుంబసభ్యులకు ఇప్పించుకున్నట్లు తెలుస్తోంది. కలెక్టర్, జేసీ స్పందించి ఎస్సీ కార్పొరేషన్ పరిధిలోని దుకాణాలకు టెండర్లు నిర్వహించి, కొత్తవారికి అవకాశం కల్పించాలని పలువురు కోరుతున్నారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం ప్రెస్‌క్లబ్



- 25 ఏళ్లకుపైగా పాతుకుపోయిన వైనం
- షాపు దక్కించుకుని బయటి వ్యక్తులకు అప్పగింత
- రూ.లక్షల్లో అడ్వాన్సులు, రూ. వేలల్లో బాడుగల ఆర్జన

ఎస్సీ కార్పొరేషన్ పరిధిలోని నగరంలో క్లాక్‌టవర్, కలెక్టరేట్ సమీపంలో 40 దుకాణాలను నిర్మించారు. అప్పట్లో వీటికి నెలకు రూ. 250లు చొప్పున బాడుగలు నిర్ణయించారు. ప్రతి ఐదేళ్లకోసారి రెన్యువల్, టెండర్లు నిర్వహించేలా అప్పటి ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు సమాచారం. అయితే నేటి వరకూ షాపులు రెన్యువల్ చేయలేదు. టెండర్లు ఆహ్వానించ

ఎస్సీ కార్పొరేషన్ ఆదాయానికి భారీ గండి

లేదు. దీంతో 25 ఏళ్ల కింద ట నిర్ణయించిన రూ. 250లు బాడుగనే కొందరు చెల్లిస్తుండగా... మరి కొందరు ఆ బాడుగను కూడా సక్రమంగా చెల్లించనట్లు సమాచారం. క్షేత్రస్థాయిలో మాత్రం ఇతర వ్యక్తులకు షాపులు అప్పగించి ఒక్కో దాని నుంచి రూ. 2 లక్షలు అడ్వాన్సులు, నెలకు రూ. 10 వేల నుంచి రూ. 15 వేలు బాడుగలు తీసుకుంటూ ఎస్సీ కార్పొరేషన్ ఆదాయానికి భారీస్థాయిలోనే గండి కొడుతున్నట్లు సమాచారం.

ఎక్కువ అద్దెకు బయటి వ్యక్తులకు...

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1997, 2002, 2005 సంవత్సర కాలంలో ఎస్సీ కార్పొరేషన్ కింద దాదాపు 200కుపైగా దుకాణాలను నిర్మించింది. ఒక్కో నియోజకవర్గంలో దాదాపు 10, 15 షాపులు చొప్పున ఆమోదం తెలిపి నిర్మించారు. దుకాణాలన్నీ ఎస్సీ కార్పొరేషన్ పరిధిలో ఉన్నప్పటికీ జిల్లా సెలెక్షన్ కమిటీ కింద కలెక్టర్‌కు ఎంపిక ప్రక్రియను అప్పగించారు. షాపులు అప్పగించే సమయంలో బాడుగ చెల్లించడంలో మూడు నెలల వరకూ గడువు ఉంటుందని.. అప్పటికీ ఎవరైనా చెల్లించక పోతే నోటీసులిచ్చి ఆ షాపును మరొకరికి అప్పగిస్తామని పొందుపరిచినట్లు అధికార వర్గాల సమాచారం. అప్పట్లో దుకాణాలను దక్కించుకున్న వారి పేర్లు కార్పొరేషన్ రికార్డుల్లో మాత్రమే దర్శనమిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో చూస్తే 70 శాతం మంది బయటి వ్యక్తులే దుకాణాల్లో దర్శనమిస్తున్నారు. షాపు దక్కించుకుని, బయటి వ్యక్తులకు ఎక్కువ అద్దెకు ఇచ్చేశారనే ఆరోపణలు ఉన్నాయి. నగర నడిబొడ్డులో ఉండటం, వాణిజ్య పరంగా డిమాండ్ ఉండటంతో ఒక్కో దుకాణానికి రూ. లక్షల్లో అడ్వాన్స్‌లు తీసుకుంటూ, నెలకు రూ. 15 వేల నుంచి రూ. 20 వేల వరకూ అద్దెలు తీసుకుంటూ బయటి వ్యక్తుల అప్పగించారన్న విమర్శలు న్నాయి. ఎవరైనా అధికారులు తనిఖీల కెళ్లినప్పుడు వారంతా తమవారే అంటూ అధికారులను బురిడీ కొట్టిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.


కలెక్టరేట్ పక్కన గల ఎస్సీ కార్పొరేషన్ దుకాణాలు

పరిశీలిస్తున్నాం



నగరంలోని ఎస్సీ కార్పొరేషన్ పరిధిలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లలో కొంత మంది అద్దెలు సక్రమంగా చెల్లించడం లేదు. ఇటీవల మాల కార్పొరేషన్ ఛైర్మన్ విజయ్‌కుమార్ షాపులను పరిశీలించిన సందర్భంలో ఈ విషయం బయటపడింది. బినామీలు ఉన్న విషయం నా దృష్టికి రాలేదు. అయితే వీటన్నింటిని పరిశీలిస్తున్నాం. నివేదికలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపుతాం.


- రాధిక, ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌చార్జ్ ఈడీ

జట్కావాలా..

గుర్రపు డెక్కల శబ్దం
వినిపించినా..
జట్కా బండి వచ్చి.. ఆగినా..
ఊరి జనం చూపంతా.. అటే..
వారి కళ్లన్నీ బండిపైనే..
అందులోంచి దిగేవారు..
రాజ కుటుంబీకులో..
భూసాములోనని..
ఆతృతగా చూసేవారు..
ఆ ఠీవి వేరు..
గత వైభవానికి గుర్తుగా..
ధర్మవరంలో ఓ జట్కా బండి..
నేటికీ తిరుగుతోంది..
ఆంగ్లేయులను
మెప్పించిన బండి అంటూ..
మురిసిపోతున్నాడు యజమాని..
80 ఏళ్ల జట్కా స్టాండు స్మృతులను
నెమరు వేసుకుంటున్నాడు..
80 బండ్లున్న స్టాండులో
ఒంటరిగా
మిగిలిపోయాడు..
భారంగా బండి
నడుపుతున్నాడు..
జట్కావాలా..
మహబూబ్ బాషా..

బ్రిటిష్ పాలన రోజుల్లో ప్రయాణాలు చేసేందుకు ధనికులు, భూస్వాములు జట్కా బండ్లను వాడేవారు. కాలక్రమేణా ఆ జట్కాబండి కనుమరుగైపోయింది. ధర్మవరం పట్టణంలో మాత్రం నేటికీ జట్కాబండి తిరుగుతోంది. పట్టణ నడిబొడ్డున ఉన్న జట్కా స్టాండు ఒకప్పుడు ఓ వెలుగు వెలిగింది. 1945లో సుమారు 80 జట్కాబండ్లతో పాత బస్టాండు అంజుమన్ సర్కిల్ సమీపంలో ఏర్పాటు చేసుకున్నారు. నేటికీ జట్కాస్టాండుగా ఎంతో గుర్తింపు ఉంది. జట్కా స్టాండు 80ఏళ్లు పూర్తి చేసుకుంటోంది. జట్కా బండి నిర్వాహకుడు మహబూబ్‌బాషా మాట్లాడుతూ.. తమ కుటుంబానికి జట్కాబండి జీవనాధారం అంటున్నారు. తన తాత అలామ్‌సాబ్, ఆ తర్వాత తన తండ్రి సత్తార్ సాహెబ్ జట్కాబండితో కుటుంబాన్ని పోషించేవారని గుర్తు చేసుకున్నారు. తాను కూడా 60 ఏళ్లుగా జట్కాబండితో కుటుంబాన్ని పోషించుకుంటున్నానని చెబుతున్నారు. అప్పట్లో జట్కాబండ్లకు చాలాగిరాకీ ఉండేదనీ, ఇందులో వెళితే ఎంతో గొప్పగా భావించేవారన్నారు. అప్పట్లో అనాలు, పైసలు తీసుకుని, గమ్యస్థానాలకు చేర్చేవారమని గుర్తు చేసుకున్నారు. ఆ తర్వాత రూ.2కే సుమారు 20 కిలోమీటర్ల వరకు తీసుకెళ్లేవారమన్నారు. అప్పట్లో తీరికలేకుండా గిరాకీ ఉండేదనీ, స్టాండులో 80 బండ్ల వరకు పెట్టుకుని జీవనం సాగించేవారమన్నారు. జిల్లాలోనే ధర్మవరంలో అత్యధికంగా జట్కాబండ్లు ఉండేవంటున్నారు. అప్పట్లో రైల్వేస్టేషన్ నుంచి ధర్మవరంలోకి రావాలంటే జట్కాబండిని తప్పనిసరిగా ఎక్కేవారు. కాలక్రమేణా ఆటోలు, రిక్షాలు, ద్విచక్రవాహనాలు రావడంతో జట్కా బండ్లు ఎక్కేవారే కరువయ్యారు. దీంతో సరుకులను పట్టణంలోని పలు ప్రాంతాలకు రవాణా చేస్తూ.. పొట్ట నింపుకుంటున్నానని మహబూబ్ చెబుతున్నారు. పెద్దగా గిరాకీ లేకపోయినా.. తరాల నుంచి చేస్తున్న పని కావడంతో వదులుకోలేకపోతున్నానని ఆయన వివరిస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, ధర్మవరం రూరల్




జట్కా బండి నిర్వాహకుడు మహబూబ్ బాషా

పులకుర్తి గ్రామంలో పనులను పరిశీలిస్తున్న అధికారులు



పల్లె దారి.. పరుగు

పటిష్టంగా సిమెంట్ రోడ్లు

బురద బాధ తప్పుతుందని జనం హర్షం

డి.హీరేహాళ్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): అడుగడుగునా గుంతలమయమైన రహదారులకు మహర్దశ కలిగింది. వైసీపీ ఐదేళ్ల పాలనలో రోడ్లన్నీ గుంతలతో బురదమయంగా మారాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక గత మూడునెలలుగా గ్రామాల్లో రోడ్ల నిర్మాణం పరుగులు పెడుతోంది. నూతన రోడ్ల నిర్మాణంతో గ్రామీణ దారులు కళకళలాడుతున్నాయి. దీంతో గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. డి.హీరేహాళ్ మండల వ్యాప్తంగా 16 గ్రామ పంచాయతీల్లో 31 పల్లెలు ఉన్నాయి. గత మూడునెలల కాలంలో మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో 76 సిమెంట్ రోడ్లకుగాను రూ. 3 కోట్లకుపైగా నిధులతో పనులు చేపట్టారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక గ్రామానికి రూ. 20 లక్షల నుంచి రూ. 30 లక్షలు వెచ్చించి నూతన రోడ్లను నిర్మించారు. ఇందులో ముఖ్యంగా వన గుడ్డం గ్రామచరిత్రలో ఒకేసారి రూ. 10 లక్షలకు మించి అభివృద్ధి పనులను చేపట్టలేదు. ఆ గ్రామంలో చాలా ఏళ్లుగా దారులు, మురికి కాలువలుగా మారిపోవడంతో గ్రామస్థులు, నాయకులు ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన వెంటనే ఆ ఒక్క గ్రామానికే రూ. 25 లక్షలు నూతన రోడ్ల నిర్మాణానికి మంజూరు చేయించారు. వెంటనే పనులు మొదలుపెట్టి పూర్తి చేశారు. గతంలో మురికిమయంగా మారిన దారులు.. ప్రస్తుతం వీధులన్నీ నూతన రోడ్లతో కళకళలాడుతున్నాయి.


సోమలాపురంలో పూర్తయిన సిమెంట్ రోడ్డు

అడిగిన వెంటనే మంజూరు



డి.హీరేహాళ్ గ్రామంలో చాలా ఏళ్లుగా రోడ్లు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. వైసీపీ ప్రభుత్వంలో కూడా అధికారులను రోడ్ల విషయమై విన్నవించుకున్నా పట్టించుకోలేదు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో రోడ్లకు నిధులు మంజూరు చేయించారు. దీంతో పనులు పూర్తి రోడ్లను ప్రారంభించారు. నూతన రోడ్లతో వీధులు కళకళలాడుతున్నాయి.

- నాగళ్ల రాజు, డైరెక్టర్, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం



గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం. వైసీపీ పాలనలో గ్రామాల్లో ఎక్కడ చూసినా బురదమయంగా ఉన్న రోడ్లను ఎన్నికల ప్రచారంలో పరిశీలించాం. గ్రామీణులు రోడ్లు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రహించి ఎమ్మెల్యే చొరవ చూపారు. ఇందులో భాగంగానే ప్రతి గ్రామంలోనూ రూ. 10 లక్షల నుంచి రూ. 20 లక్షల వ్యయంతో నూతన రోడ్లను ఏర్పాటు చేస్తున్నాం. రాబోవు రోజుల్లో మరిన్ని సిమెంట్ రోడ్ల నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

- హనుమంతరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్

డ్రోన్ సేద్యం.. ఉపాధి మార్గం..

- యువకుడి వినూత్న ఆలోచన
- డ్రోన్ సాయంతో పంటలకు మందుల పిచికారీ
- సమయం, డబ్బు ఆదా అంటున్న నాగమునీంద్ర

యల్లనూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): అగ్రికల్చర్ డిప్లొమో కోర్సు చదివిన యువకుడు వినూత్న ఆలోచన చేశాడు. సేద్యానికి సాంకేతిక సాయం అందించాలనుకున్నాడు. డ్రోన్ సేద్యాన్ని ఎంచుకున్నాడు. రైతులకు సమయం, డబ్బు ఆదా చేయడంతోపాటు తానూ ఉపాధి పొందుతున్నాడు యల్లనూరుకు చెందిన అచ్యుత నాగమునీంద్ర. యువకుడి చిన్నతనంలోనే తండ్రి నారాయణస్వామి మరణించాడు. తల్లి తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్నారు. నాగమునీంద్ర అగ్రికల్చర్ డిప్లొమో కోర్సు చేశాడు. ఉద్యోగం చేయడం ఇష్టంలేక స్వయం ఉపాధి మార్గాన్ని ఎంచుకున్నాడు. అందులో భాగంగా విజయవాడలో డ్రోన్ వినియోగంపై శిక్షణ తీసుకున్నాడు. సాధారణంగా రైతులు వరి, అరటి, మొక్కజొన్న, పప్పుశనగ తదితర పంటలపై క్రిమిసంహారక మందులు పిచికారీ చేయాలంటే ఇబ్బందులు పడేవారు. పంటలపై తొక్కుకుంటూ పిచికారీ చేసేవారు. మరి కొన్నిచోట్ల ట్రాక్టర్లతో సైతం పిచికారీ చేసేవారు. ఈ కష్టాలకు చెక్ పెడుతూ.. నాగమునీంద్ర డ్రోన్ సేద్యాన్ని ఎంచుకున్నాడు. సుమారు రూ.6లక్షలతో డ్రోన్‌ను కొనుగోలు చేశాడు. తద్వారా పంటలకు మందులు పిచికారీ చేస్తున్నాడు. ఎకరాలో పిచికారీకి మనుషుల సాయంతో 30 నిముషాల సమయం పట్టేది. డ్రోన్ ద్వారా 5 నిమిషాల్లోనే పూర్తి చేస్తున్నాడు. మందుల పిచికారీకి ఎకరాకు 75నుంచి 90లీటర్ల నీరు అవసరం. డ్రోన్ ద్వారా 10లీటర్ల నీరు చాలని నాగమునీంద్ర చెబుతున్నాడు. పురుగు మందులు కూడా 20శాతం ఆదా కావడంతో పాటు డబ్బు మిగులుతోందని రైతులు చెబుతున్నారు. డ్రోన్ ద్వారా ఎకరాలో పిచికారీకి రూ.500 అద్దె తీసుకుంటున్నాడు. వరిపొలాల్లో మనుషుల ద్వారా పిచికారీ చేయాలంటే రూ.600 నుంచి రూ.800 వరకు ఖర్చవుతుంది. రైతులు నీరు మోస్తూ శ్రమించాల్సి ఉంటుంది. డ్రోన్‌తో అయితే ఆ శ్రమ కూడా ఉండదని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు, డ్రోన్ వినియోగంపై పరిసర ప్రాంతాల రైతులకు అవగాహన సైతం కల్పిస్తున్నానని నాగమునీంద్ర చెబుతున్నాడు. ఫలితంగా రైతులే నేరుగా ఫోన్ చేసి, మందులు పిచికారీ చేయాలని కోరుతున్నారట. ఈ విధానంతో డబ్బు ఆదా అవడంతోపాటు శ్రమ కూడా తగ్గుతుండడంతో రైతులు డ్రోన్ ద్వారా పిచికారీపై మక్కువ చూపుతున్నారు.




ద్విచక్రవాహనంలో వెళ్తున్న నాగమునీంద్ర


నాగ మునీంద్ర


సాగులో ఉన్న పొగాకు పంట

పొగాకే మేలు..!

చీడపీడలు తక్కువ
అగ్రిమెంట్ మేరకు ధర
ఆసక్తి చూపుతున్న రైతులు


దండలుగా కూర్చి ఆరబెట్టిన పొగాకు

పెద్దవడుగూరు మండలంలో పత్తి, మిరప తదితర పంటల సాగుతో ఆర్థికంగా నష్టపోయిన రైతులు ఈ సారి పొగాకు పంటను సాగు చేశారు. ఈ పంటకు చీడపీడలు ఆశించకపోవడం, పలు ప్రైవేట్ కంపెనీలే ముందస్తు ధర నిర్ణయించి దిగుబడిని కొనుగోలు చేస్తుండటంతో రైతులు ఈ పంట సాగు వైపు మొగ్గు చూపారు. పెద్దవడుగూరు, లక్షుంపల్లి, చిన్నవడుగూరు గ్రామాల్లో 152 హెక్టార్లలో పంటను సాగుచేశారు. - ఆంధ్రజ్యోతి, పెద్దవడుగూరు


పొగాకు బేళ్లు

పంట సాగు, విక్రయం ఇలా..

పొగాకు పంట సాగు కోసం రైతులు నంద్యాల, బనగానపల్లి, నెల్లూరు ప్రాంతాల నుంచి నారును కొనుగోలు చేశారు. ఎకరా విస్తీర్ణంలో పంట సాగు చేయాలంటే 10వేల మొక్కలు అవసరమవుతాయి. ఒక్కో మొక్కకు రవాణా ఖర్చుతో కలుపుకొని రూ.2చొప్పున వెచ్చిస్తున్నారు. మరికొందరు బోరుబావి గల రైతులు కిలో విత్తనాలను రూ.600చొప్పున కొనుగోలు చేసి తమ పొలాల్లో నారు వేసుకొని పంట సాగు చేస్తున్నా రు. నారు నాటిన తర్వాత మూడు నెలలకు పొగాకు పక్వానికి వస్తుంది. అప్పుడు కూలీల సాయంతో మొక్క నుంచి ఆకును వేరు చేస్తారు. వాటిని దండలుగా కూర్చి కట్టెలతో ఏర్పాటు చేసిన తాత్కాలిక షెడ్లలో 15రోజుల పాటు ఎండబెడతారు. అనంతరం పొగాకు బేళ్లుగా ఏర్పాటు చేసి క్వింటా రూ.15500 చొప్పున ముందస్తుగా ఒప్పందం కుదుర్చుకున్న కంపెనీలకు విక్రయిస్తారు. ఎక్కువ మంది బనగానపల్లిలో ఉన్న ఐటీసీ కంపెనీకి తరలిస్తున్నారు. ప్రస్తుతం ఎకరాకు ఏడు క్వింటాళ్ల నుంచి 12క్వింటాళ్ల మేర దిగుబడి వస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. కాగా ఎకరానికి దాదాపు రూ.70వేల దాక పెట్టుబడి అవుతుందని వారు పేర్కొన్నారు.

ముందస్తు ఒప్పందంతోనే ఆసక్తి



రెండెకరాల పొలంలో పొగాకు పంటను సాగుచేశా. కొన్ని కంపెనీలు ముందస్తు అగ్రిమెంట్ ధర నిర్ణయించడంతో పంట సాగుపై ఆసక్తి కలిగింది. ప్రస్తుతం ఎకరాకు 8 క్వింటాళ్ల మేర దిగుబడి వచ్చింది. పంట సాగు మొదలు నుంచి ఇప్పటివరకు రెండెకరాలకు కలిపి రూ.1.4లక్షలు పెట్టుబడి పెట్టా. ఇంకా దిగుబడి వచ్చే అవకాశం ఉంది. వచ్చిన దిగుబడిని బనగానపల్లిలో ఉన్న మార్కెట్‌కు తరలించి విక్రయిస్తున్నాం. -రంగనాయకులు, పెద్దవడుగూరు

దిగుబడి బాగా వచ్చింది

ఈ ఏడాది పొగాకు పంట సాగు చేయగా దిగుబడి ఆశించినస్థాయిలో ఉంది. గతంలో సాగుచేసిన పంటల్లో లాభాలు రాకపోవడంతో 5ఎకరాల్లో పొగాకు పంట వేశా. ఈ పంట సాగుకు చీడపీడలు తక్కువైనా కూలీలు అధికంగా కావాల్సి ఉంటుంది. ఇప్పటివరకు 10క్వింటాళ్ల మేర దిగుబడి వచ్చింది. పంట మొత్తం మూడు నుంచి నాలుగు కోతలు కోస్తాం. మొదటి, రెండు కోతల్లో కోసిన పంటకు క్వింటా రూ.15500 ఉండగా చివరి కోత మాత్రం నాణ్యతను బట్టి ధరను నిర్ణయిస్తారు. - ఓబుల్‌రెడ్డి, లక్షుంపల్లి

ఔరా.. గిజిగూడు..!



చిటారు కొమ్మకు వేలాడే..
ఇల్లు కట్టుకున్నావు..
ఇంజనీరువు కావు..

లోపలికెళ్లేందుకు
ప్రత్యేక ద్వారం
పెట్టుకున్నావు..
మేస్త్రీవి కావు..

గడ్డి పోచలతో..
నార పాసలతో..
అందమైన బొమ్మరిల్లు
అల్లుకున్నావు..
చెయ్యి తిరిగిన
కళాకారుడివి కావు..

కోట్లు పెట్టి కట్టిన..
భవంతులే కూలుతున్నాయి..
నీ ఇల్లు మాత్రం
చెక్కు చెదరదు..

ఏంటో ఆ నైపుణ్యం..
కాస్త.. చెప్పా..
గిజిగాడా..


ఈత చెట్టుపై గిజిగాడు ఏర్పాటు చేసుకున్న గూళ్లు

చిలమత్తూరు మండలంలోని కొడికొండ చెక్‌పోస్టు సమీపాన ఈత చెట్టులో పెద్ద సంఖ్యలో గిజిగాడు పక్షులు గూళ్లను నిర్మించుకున్నాయి. ఇంజనీర్లను సైతం ఆలోచింపజేసేలా నిర్మాణాలు చేసుకోవడమే విశేషం. ఇతర పక్షులు గంప ఆకారంలో గూళ్లను నిర్మించుకుంటాయి. గిజిగాడు మాత్రం ఒకచోట మాత్రమే ద్వారం ఉండేలా చూసుకుంటుంది. మిగిలిన చోట్లలో కనీసం చీమ కూడా గూడు లోపలికి చొరబడలేని విధంగా మామూలు గడ్డిపోచలతో గూడును ఏర్పాటు చేసుకుంటుంది. అదే గిజిగాడి గొప్పతనం. ప్రకృతి అద్భుతం.

- చిలమత్తూరు, ఆంధ్రజ్యోతి



పరుషకు తరలివచ్చిన జనసందోహం

ఘనంగా గావుల మహోత్సవం

దాదులూరు పరుషకు పోటెత్తిన జనం

కనగానపల్లి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని దాదులూరు పరుషకు జనం పోటెత్తారు. పరుషలో భాగంగా మూడో రోజైన మంగళవారం గావుల మహోత్సవం ఘనంగా నిర్వహించారు. పోతురాజులు.. నల్లని మేకపిల్లని కొరికి పోతులయ్య స్వామికి నైవేద్యంగా సమర్పించారు. ఈ ఘట్టాన్ని చూసేందుకు వందలాది మంది భక్తులు తరలివచ్చారు. అనంతరం దాదులూరులోనే కాక చుట్టుపక్కల గ్రామాల్లో జంతుబలి ఇచ్చారు. ముందుగా చెన్నకేశవస్వామిని దర్శించుకున్న భక్తులు.. పోతులయ్య, బంగారు లింగమయ్యకు టెంకాయలు కొట్టి, మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో దాదులూరు గ్రామం జనసంద్రంగా మారింది.

మార్కెట్ ఫీజు వసూళ్లలో నిర్లక్ష్యం వద్దు

మార్కెటింగ్ శాఖ ఆర్జేడీ రామాంజనేయులు

అనంతపురం రూరల్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మార్కెట్ ఫీజు వసూళ్లలో నిర్లక్ష్యం వద్దని మార్కెటింగ్ శాఖ ఆర్జేడీ రామాంజనేయులు.. ఆ శాఖాధికారులను ఆదేశించారు. స్థానిక గుత్తి రోడ్డులోని ఏడీ కార్యాలయంలో మంగళవారం ఉమ్మడి జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారులు, కార్యదర్శులతో మార్కెట్ ఫీజు వసూళ్ల లక్ష్యాలపై సమీక్ష నిర్వహించారు. ఆర్జేడీ మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలోని 17 మార్కెట్ కమిటీల్లో మూడు, నాలుగు తప్ప.. మిగిలిన వాటిలో వసూళ్లు ఆశాజనకంగా ఉన్నాయన్నారు. అనంతపురం జిల్లా 2024-25 ఆర్థిక సంవత్సరం టార్గెట్ రూ.12.7కోట్లకుగాను 9.97కోట్లు వసూలు చేసిందన్నారు. శ్రీసత్యసాయి జిల్లా లక్ష్యం రూ.5.31కోట్లుకాగా, ఇప్పటికే రూ.4.34కోట్లు రాబట్టిందన్నారు. అన్ని కమిటీలు ఆర్థిక సంవత్సరం చివరికి టార్గెట్లు పూర్తి చేయాలన్నారు. ప్రణాళికాబద్ధంగా లక్ష్యాలను అధిగమించాలని సూచించారు. కార్యక్రమంలో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల ఏడీలు సత్యనారాయణ చౌదరి, మూర్తి, ఉమ్మడి జిల్లాలోని మార్కెట్ యార్డుల కార్యదర్శులు పాల్గొన్నారు.

పీజీ ఫలితాల్లో వైద్య విద్యార్థుల సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ప్రొఫెసర్లు

అనంతపురంటౌన్, మార్చి4(ఆంధ్రజ్యోతి): పీజీ వైద్యవిద్య పరీక్షల్లో అనంత వైద్య కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. పీజీవైద్య విద్య ఫలితాలను ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ సోమవారం విడుదల చేసింది. ఈ ఫలితాల్లో అనంత వైద్య కళాశాల, జిల్లా సర్వజనాస్పత్రిలో చదువుతున్న పీజీ విద్యార్థులు అత్యంత ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ మంగళవారం వెల్లడించారు. రాష్ట్రస్థాయిలో ఐదు విభాగాల్లో ర్యాంకులు సాధించినట్లు ఆయన తెలిపారు. ఇందులో గైనకాలజీ విభాగంలో ఈఏడాది కూడా డాక్టర్ సుభోషిత78శాతం మార్కులతో మొదటి ర్యాంకు సాధించగా, డాక్టర్ అమృత77శాతం మార్కులతో మూడో ర్యాంకు సాధించినట్లు తెలిపారు. డెర్మటాలజీ విభాగంలో డాక్టర్ శివాని78శాతం మార్కులతో మొదటి ర్యాంకు, డాక్టర్ నిహారిక 77.7 శాతం మార్కులతో రెండో ర్యాంకు, డాక్టర్ రమ్య 76శాతం మార్కులతో నాలుగో ర్యాంకు సాధించినట్లు పేర్కొన్నారు. పార్మకాలజీ విభాగంలో డాక్టర్ సాగరిక 76శాతం మార్కులతో రెండో ర్యాంకు, కమ్యూనిటీ మెడిసిన్ విభాగంలో డాక్టర్ హర్షిత76శాతం మార్కులతో రెండో ర్యాంకు సాధించినట్లు పేర్కొన్నారు. మైక్రోబయాలజీ విభాగంలో డాక్టర్ యల్లం నాయుడు71శాతం మార్కులతో మొదటిర్యాంకు సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. వీరందరిని ప్రిన్సిపాల్ డాక్టరు మాణిక్యాలరావు మంగళవారం అభినందించారు.

దరఖాస్తు చేసుకోండి

జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ

అనంతపురం అర్బన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ యంత్రీకరణ పథకం కింద పరికరాల కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి వ్యవసాయ శాఖ, ఏపీ ఆగ్రోస్ సంస్థ ద్వారా 50 శాతం సబ్సిడీతో వ్యవసాయ పనిముట్లు సరఫరా చేస్తామన్నారు. జిల్లాకి 1661 యూనిట్లకు రూ.2.86 కోట్లు కేటాయించారన్నారు. వాటిలో 250 బ్యాటరీ, మ్యానువల్‌గా ఉపయోగించే స్ప్రేయర్లు, 600 పవర్ స్ప్రేయర్లు, 7 ట్రాక్టర్‌తో ఉపయోగించే స్ప్రేయర్లు, 740 ట్రాక్టర్‌తో నడిచే యాంత్రీకరణ పనిముట్లు, 28 రొటోవేటర్లు, 18 పవర్ వీడర్లు, 13 కత్తిరింపు యంత్రాలు, 5 పవర్ టిల్లర్లు ఉన్నాయన్నారు. ఐదేళ్లుగా వ్యవసాయ పనిముట్లు తీసుకోని ఎస్సీ, ఎస్టీ, మహిళా, చిన్న, సన్నకారు రైతులు అర్హులన్నారు. పథకం ద్వారా లబ్ధి కోసం తప్పని సరిగా ఈ పంట నమోదు చేసుకుని ఉండాలన్నారు. అటవీ భూములు కలిగిన రైతులు కూడా అర్హులేనన్నారు. కుటుంబంలో ఒక రైతు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒక రైతుకు ఒక పనిముట్టు మాత్రమే అందజేస్తామన్నారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 26వ తేదీలోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేకాటలో దొంగనోటు

ఉప్పందించిన ఆటగాడు

ముఠాను పట్టుకున్న పోలీసులు

ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కబోయి.. జైలుపాలు

అనంతపురం క్రైం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): పేకాటలో ఇద్దరు వ్యక్తులు నకిలీ నోట్లను పెట్టారు. మంగతాయారు (లోపల-బయట) ఆడుతూ.. మోసగించబోయారు. వీరి మోసాన్ని పసిగట్టిన ఒక 'ఆటగాడు' వారికి బుద్ధి చెప్పాలని అనుకున్నాడు. 'సార్.. టీవీ టవర్ దగ్గర గొడవ జరుగుతోంది..' అని పోలీసులకు ఉప్పందించాడు. ఈనెల 28వ తేదీ శివరాత్రి రోజు వచ్చిన ఈ సమాచారం ఆధారంగా పోలీసులు ఆ ప్రాంతానికి వెళ్లి మురళీమోహన్‌రెడ్డి, సాకే రామాంజినేయులు అనే ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.24 వేలు స్వాధీనం చేసుకున్నారు. తీరా చూస్తే.. అవి రూ.500 నకిలీ నోట్లు అని తేలింది. లోతుగా విచారిస్తే.. నకిలీ నోట్ల ముఠా గుట్టు బయటపడింది. పోలీసులు ఎనిమిది మందిని అరెస్టు చేశారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు.

డీఎస్పీ ఏం చెప్పారంటే....

వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్‌తో కలిసి అనంతపురం డీఎస్పీ శ్రీనివాసరావు మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. 'నగరంలో నకిలీ కరెన్సీ చలామణీని కట్టడి చేయాలని ఎస్పీ జగదీష్ ఆదేశించారు. వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ సిబ్బందితో కలిసి నిఘా ఉంచారు. ఎస్‌జేఆర్ ఫంక్షన్ హాల్ వద్ద నొస్సం మురళీమోహన్‌రెడ్డి, సాకే రామాంజినేయులు, యలమంచి రామాంజినేయులుకు నకిలీ నోట్లను దేవరకొండ రవీంద్ర అనే వ్యక్తి ఇస్తుండగా అరెస్టు చేశారు. రవీంద్ర నుంచి 60 నకిలీ రూ.500 నోట్లు స్వాధీనం చేసుకున్నారు. వారి వాంగ్మూలం ఆధారంగా బుడ్డప్పనగర్‌లో సుకుమార్ ఇంటి వద్ద ప్రధాన నిందితుడు దూదేకుల ఖాసీం, బోయ పవన్‌కుమార్, పడిగల సుకుమార్, బొమ్మినేని అశోక్‌చౌదరిని అరెస్టు చేశారు. వారి నుంచి 36 నకిలీలో రూ.500 నోట్లను, ఒక లాప్ టాప్, కలర్ ప్రింటర్, పేపర్ కట్టర్, కలర్ జిరాక్స్ పౌడర్, పేస్ట్, బ్రష్‌లను స్వాధీనం చేసుకున్నారు..' అని తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో..

ముఠాలో ప్రధాన నిందితుడు దూదేకుల ఖాసీం, ఇతర నిందితులు బోయ పవన్‌కుమార్, పడిగల సుకుమార్, బొమ్మనేని అశోక్‌చౌదరి, దేవరకొండ రవీంద్ర స్నేహితులు. ఖాసీం గతంలో శ్రీసత్యసాయి బాల వికాస్ స్కూల్‌లో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేసేవాడు. అక్కడ నకిలీ సర్టిఫికెట్లు తయారు చేస్తూ అనంతపురం త్రీ టౌన్ పోలీసులకు పట్టుబడి జైలుకు వెళ్లి వచ్చాడు. పెద్దవడుగూరు మండలంలో పంచాయతీ సెక్రటరీగా పనిచేస్తూ, అక్రమాలకు పాల్పడి సస్పెండ్ అయిన కృష్ణారెడ్డి ఖాసీం ఇంటి సమీపంలో ఉండేవాడు. వీరిద్దరూ కలిసి ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడేందుకు నకిలీ కరెన్సీ తయారు చేయాలని భావించారు. బోయ పవన్‌కుమార్, పడిగల సుకుమార్, బొమ్మినేని అశోక్‌చౌదరి, దేవరకొండ రవీంద్రతో కలిసి పథకం వేశారు. కృష్ణారెడ్డి తనవంతుగా లాప్‌టాప్ ఇచ్చాడు. దేవరకొండ రవీంద్ర రూ.20 వేల డబ్బు ఇచ్చాడు. ఆ డబ్బుతో కమలానగర్‌లో ఒక ప్రింటర్, పేపర్ కట్టర్, కలర్ జిరాక్స్ పౌడర్ పేస్ట్, బ్రష్‌లను కొన్నారు. అశోక్ చౌదరి రూ.10వేలు ఇచ్చాడు. ఆ సొమ్ముతో బెంగుళూరులో పేపర్ కొని, బుడ్డప్పనగర్‌లోని సుకుమార్ ఇంటిలో నకిలీ కరెన్సీని తయారు చేశారు. నకిలీ కరెన్సీని ధర్మవరం పట్టణానికి చెందిన సత్యనారాయణకు ఇచ్చినట్లు పోలీసుల విచారణలో తేలింది. కృష్ణారెడ్డి, సత్యనారాయణ పరారీలో ఉన్నారు. వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు.



దొంగనోటు చూపుతున్న డీఎస్పీ



అరెస్టయిన నిందితులు

రథోత్సవానికి పాదయాత్రగా వెళ్తూ మృత్యు ఒడికి..

కర్ణాటకలో రోడ్డు ప్రమాదం

ఇద్దరు నేమకల్లు యువకుల దుర్మరణం

బొమ్మనహాళ్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): రథోత్సవానికి పాదయాత్రగా వెళ్తున్న ఇద్దరు యువకులను రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. మండలంలోని నేమకల్లు గ్రామానికి చెందిన గణేష్(19), గాలి నాగరాజు (20) బళ్లారి జిల్లా పరిధి మోకా రోడ్డులో సంగనకల్లు గ్రామ సమీపాన సోమవారం రాత్రి బొలెరో ఢీకొనడంతో దుర్మరణం చెందారు. కుటుంబీకులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వన్నూరుస్వామి, వంధక్షి దంపతుల కుమారుడు గణేష్ వ్యవసాయం చేస్తుండేవాడు. గాలి తిప్పేస్వా మి, రత్నమ్మ దంపతుల కొడుకు గాలి నాగరాజు బేల్దారి పనులకు వెళ్తుండేవాడు. వీరిరువురితోపాటు నాగరాజు తమ్ముడు శివ, మరో యువకుడు రామాంజనేయులు స్వగ్రామం నుంచి సోమవారం సాయంత్రం కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గ పరిధి గూళ్యం గ్రామంలో నిర్వహించే గాదిలింగేశ్వర జోడు రథోత్సవాలకు పాదయాత్రగా బయల్దేరారు. బళ్లారి మీదుగా గూళ్యం వెళ్తున్నారు. మోకా రోడ్డులో సంగనకల్లు గ్రామ సమీపాన సిల్వర్ క్రాస్ వద్ద సోమవారం రాత్రి 9 గంటల సమయంలో రోడ్డుపక్కన అన్నదమ్ములు శివ, నాగరాజు కలిసి వెళ్తున్నారు. వెనుక నుంచి అతివేగంగా వచ్చిన బొలెరో నాగరాజును ఢీకొట్టింది. ఆ తరువాత ముందు వెళ్తున్న గణేష్ సైతం ఢీకొంది. దీంతో ఇద్దరు అక్కడికక్కడే మరణించారు. కళ్లెదుటే అన్న మరణించడంతో శివ బోరున విలపించాడు. సమాచారం అందుకున్న బళ్లారి రూరల్ పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలకు పోస్టుమార్టం చేయించి, కుటుంబీకులకు అప్పగించారు. మంగళవారం సాయంత్రం మృతదేహాలను నేమకల్లుకు తీసుకొచ్చారు. కుటుంబీకులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. చేతికొచ్చిన కొడుకులు మరణించడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రమాదంపై బళ్లారి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.



గాలి నాగరాజు, గణేష్ (ఫైల్)

బొలెరో వాహనం బోల్తా

బాలిక దుర్మరణం.. ఇద్దరికి తీవ్రగాయాలు

రాయదుర్గంరూరల్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉడేగోళం గ్రామ సమీపాన సోమవారం రాత్రి బొలెరో వాహనం బోల్తాపడి సుశీల(15) దుర్మరణం చెందగా.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కర్ణాటకలోని సండూరు తాలూకా వడ్డర్లహళ్లి గ్రామానికి చెందిన 35 మంది కళ్యాణదుర్గం సమీపంలోని బెస్తర్లపల్లి భీమలింగేశ్వరస్వామి జాతరకు వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి బొలెరో వాహనంలో వెళ్తుండగా.. అనంతపురం-రాయదుర్గం రహదారిపై ఉడేగోళం వద్ద బోల్తాపడింది. సుశీల అక్కడికక్కడే మృతిచెందగా.. ఈర మాసప్ప, ఈరప్పకు తీవ్ర గాయాలయ్యాయి. సీఐ జయనాయక్ ప్రమాద స్థలానికి చేరుకుని, తన వాహనంలో క్షతగాత్రులను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకి తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జయనాయక్ తెలిపారు.




సుశీల (ఫైల్)

మంత్రి దృష్టికి భూ అక్రమాలు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ముదిగుబ్బ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవి బ్రాహ్మణపల్లి తండాలో ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ చేసిన భూ అక్రమాలను రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ దృష్టికి తీసుకువెళ్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పేర్కొన్నారు. తండాలో మంగళవారం పర్యటించి, భూముల సమస్యలు ఉన్న మహిళలు, రైతులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తండాలోని రైతులకు పాసు పుస్తకాలు ఉన్నా, ఎంపీపీ కుటుంబ సభ్యుల పేరు మీద 1బీ అడంగళ్ లు ఉన్నాయని, వీటిపై బ్యాంకుల్లో రుణాలు కూడా తీసుకున్నారన్నారు. ఈ విషయాన్ని అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లినా వారు పట్టించుకోవడం లేదన్నారు. దాదాపు 200ఎకరాల భూములు అన్యాక్రాంతమయ్యాయన్నారు. ఈనెల 7న రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌లను అమరావతిలో కలిసి వారి దృష్టికి సమస్య తీసుకువెళ్తామన్నారు. కార్యక్రమంలో శ్రీసత్యసాయి జిల్లా సీపీఐ కార్యదర్శి వేమయ్య యాదవ్, సీపీఐ నాయకులు కాటమయ్య, జింకా చలపతి, మధు, చల్లా శ్రీనివాసులు, రవి, రమణ, బండల వెంకటేసు తదితరులు పాల్గొన్నారు.



బాధిత మహిళలతో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

అదనపు ఓపీ కౌంటర్లతో తప్పనున్న ఇబ్బందులు

సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు


అనంతపురం టౌన్, మార్చి4(ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వజనాస్పత్రిలో అదనంగా నాలుగు ఓపీ కౌంటర్లు ఏర్పాటు చేశామనీ, తద్వారా రోగులకు ఇబ్బందులు తప్పుతాయని సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రికి వచ్చే ప్రతి పేషెంట్ ఆధార్ కార్డుతోపాటు రిజిస్ట్రేషన్ చేయించుకుని ఉంటే ఎన్టీఆర్ వైద్యసేవ కార్డు తప్పనిసరిగా తెచ్చుకోవాలన్నారు. అప్పుడు ఓపీ కౌంటర్ల వద్ద ఎక్కువసేపు క్యూలైన్‌లో ఉండాల్సిన అవసరం ఉండదన్నారు. పేషెంట్లు సహకరించాలని సూపరింటెండెంట్ కోరారు. కార్యక్రమంలో ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్, డిప్యూటీ కలెక్టరు మల్లికార్జునరెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టరు సౌజన్యకుమార్ పాల్గొన్నారు.

నేడు వైద్య కళాశాల స్నాతకోత్సవం

జిల్లా వైద్య కళాశాలలో బుధవారం స్నాతకోత్సవం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టరు మాణిక్యాలరావు తెలిపారు. 2019 బ్యాచ్ ఎంబీబీఎస్ విద్యార్థులు కోర్సు పూర్తి చేసుకున్నారని ఆయన వెల్లడించారు. స్నాతకోత్సవంలో 150 మందికి డాక్టరు పట్టాలు అందజేస్తామని తెలిపారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో సాయంత్రం జరిగే ఈ వేడుకలకు కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు.

అక్రమాలను ఉపేక్షించం

విజిలెన్స్ ఎస్పీ వైబీపీటీఏ ప్రసాద్



అనంతపురం న్యూటౌన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): పేద ప్రజలపై ప్రభావం చూపే అక్రమాలను ఉపేక్షించేది లేదని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ వైబీపీటీఏ ప్రసాద్ హెచ్చరించారు. విజిలెన్స్ కార్యాలయంలోని తన చాంబర్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రెండు నెలలుగా డీఎస్పీ నాగభూషణంతో ప్రత్యేక ప్రణాళికతో తనిఖీలు నిర్వహించామని తెలిపారు. అందులో భాగంగానే పాల కల్తీ, పెట్రోల్ బంకుల్లో టాంపరింగ్ గుర్తించామని అన్నారు. పాల కల్తీ అన్ని వర్గాల ప్రజలపై ప్రభావం చూపుతుందని అన్నారు. కల్తీ పాలను తాగినవారు ఆనారోగ్య సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని అన్నారు. పెట్రోల్ బంకుల్లో టాంపరింగ్ కారణంగా వాహనదారులు నష్టపోతారని అన్నారు. కేవలం సోములదొడ్డి వద్ద ఉన్న పెట్రోల్ బంకులోనే రోజుకు 1500 లీటర్ల డీజిల్ దోపిడీ చేశారని, దీన్నిబట్టి పరిస్థితి ఎంత దారణంగా ఉందో అర్థం అవుతోందని అన్నారు. ఇతర ప్రాంతాల్లోనూ టాంపరింగ్ జరిగినట్లు గుర్తించామని, రాష్ట్ర ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చామని తెలిపారు. లీగల్ మెట్రాలజీ చట్టం ప్రకారం చర్యలు చేపట్టాలని ఆ శాఖ అధికారులకు సూచించామని తెలిపారు.

సార్.. నా కూతుర్ని చంపేశా..!

గుంతకల్లు టౌన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): 'సార్.. నా కూతుర్ని చంపేశా..' అంటూ పట్టణంలోని తిలక్ నగర్‌కు చెందిన రామాంజనేయులు మంగళవారం సాయంత్రం పోలీసుల ఎదుట లొంగిపోయాడు. దీంతో కంగారుపడిన కసాపురం పోలీసులు అతన్ని వెంటబెట్టుకుని, హత్య జరిగినట్లు భావిస్తున్న ప్రాంతానికి వెళ్లి గాలించారు. చీకటి పడటంతో ఆ ప్రాంతంలో ఎక్కడా ఆనవాళ్లు కనిపించలేదు. దీంతో అతన్ని తిరిగి స్టేషన్‌కు తీసుకొచ్చారు. తిలక్‌నగర్‌కు చెందిన రామాంజనేయులు టిఫెన్ సెంటర్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి నలుగురు కూతుళ్లు కాగా, ముగ్గురికి వివాహం జరిపించారు. తన చిన్న కూతురు ఓ యువకుడిని ప్రేమించిందని రామాంజనేయులు పోలీసులకు తెలిపాడు. ప్రేమ వ్యవహారాలు మానుకోవాలని చెప్పినా వినలేదని, దీంతో కసాపురం సమీపంలోని హంద్రీనీవా కాలువ వద్దకు తీసుకెళ్లి హత్య చేశానని తెలిపాడు. కాగా, ఉదయాన్నే తిరిగి గాలింపు చర్యలు చేపడతామని పోలీసులు తెలిపారు. రామాంజనేయులు మానసిక పరిస్థితి కూడా ప్రస్తుతం సరిగా కనిపించడం లేదని అన్నారు.

టమోటా కిలో రూ. 8

అనంతపురం రూరల్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.8తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు మంగళవారం 270 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.6, కనిష్ఠ ధర రూ.5 పలికినట్లు ఆయన తెలిపారు.

మార్కెట్‌కు పెరుగుతున్న చీనీ కాయలు

అనంతపురంరూరల్, మార్చి4(ఆంధ్రజ్యోతి): అనంతపురం వ్యవసాయ మార్కెట్‌కు చీనీ ఉత్పత్తులు పెరుగుతున్నాయి. కొన్నిరోజుల కిందట మార్కెట్ ప్రారంభమైంది. ఈక్రమంలో రోజురోజుకీ ఉత్పత్తుల రాక పెరుగుతూ పోతోంది. సోమవారం మార్కెట్‌కు 251 టన్నుల చీనీ కాయలు వచ్చాయి. మంగళవారం ఆ సంఖ్య 343 టన్నులకు పెరిగింది. సంబంధిత అధికారులు ఈ నామ్ పద్ధతిలో వేలం నిర్వహించారు. టన్ను గరిష్ఠంగా రూ.24,160, కనిష్ఠంగా రూ.6వేలు, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు.

400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు కృష్ణా జలాలు 400 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వస్తున్నట్లు మంగళవారం అధికారులు తెలిపారు. ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 383 క్యూసెక్కులు వెళుతుండగా రిజర్వాయరులో ప్రస్తుతం 1.586 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

పది పరీక్షల పరిశీలకుడిగా జేడీ సుబ్బారావు

అనంతపురం విద్య, మార్చి4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లా పదో తరగతి పరీక్షల పరిశీలకుడిగా సంయుక్త సంచాలకుడు (జేడీ) సుబ్బారావును నియమించారు. ఈనెల 17 నుంచి 31వ తేదీ వరకూ పదో తరగతి పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ క్రమంలో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పదో తరగతి పరీక్షల పరిశీలకుడిగా విద్యాశాఖ కమిషనరేట్‌లో పనిచేస్తున్న జేడీ సుబ్బారావును నియమిస్తూ కమిషనర్ విజయరామరాజు ఉత్తర్వులు జారీచేశారు.

'మనమిత్ర' నుంచి టెన్త్ హాల్ టిక్కెట్లు

అనంతపురం విద్య, మార్చి 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని గుర్తింపు పొందిన యాజమాన్య హైస్కూళ్లలోని పదో తరగతి విద్యార్థులు, ప్రైవేట్ విద్యార్థుల పరీక్షల హాల్ టిక్కెట్లను పాఠశాల విద్యాశాఖ అందుబాటులోకి తెచ్చినట్లు డీఈఓ ప్రసాద్‌బాబు, ఏసీ గోవింద్ నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టెన్త్ విద్యార్థులు తమ హాల్ టిక్కెట్లను మనమిత్ర వాట్సప్ నంబర్ 9552300009 నుంచి లేదా www.bse.ap.gov.in వెబ్‌సైట్ నుంచి పొందవచ్చునన్నారు. డౌన్‌లోడ్ చేసుకున్న విద్యార్థుల హాల్ టిక్కెట్‌లో విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, మీడియం, ఫొటో సంతకం వంటి వివరాలు తప్పుగా ఉంటే ప్రధానోపాధ్యాయుల ద్వారా dir_govexams@y ahoo.com మెయిల్ చేయాలని సూచించారు.

కంప్యూటర్ ఉచిత శిక్షణ.. ఉపాధి

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీయువకులకు కంప్యూటర్‌లో ఉచిత శిక్షణ, అనంతరం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనున్న ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. 60రోజులపాటు బేసిక్ కంప్యూటర్ స్కిల్స్, ఎంఎస్ ఆఫీస్, లైఫ్ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్, బేసిక్ స్పోకెన్ ఇంగ్లిష్, కస్టమర్ రిలేషన్‌షిప్ స్కిల్స్ కోర్సుల్లో నైపుణ్య శిక్షణ ఇస్తామన్నారు. ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, ఇంజనీరింగ్ చదవి 20-35 సంవత్సరాల మధ్య వయసు కలిగిన వారు అర్హులన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్ అందజేసి, వంద శాతం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. వివరాలకు ఆర్టీటీ స్టేడియం ఎదురుగా ఉప్పరపల్లి రోడ్డులోని ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో నేరుగాగానీ, 7396950345 నంబరులోగానీ సంప్రదించాలని కోరారు.

న్యూస్ బాక్స్

చెట్లు నరికే వారిపై చర్యలు తీసుకోండి

ధర్మవరం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ధర్మవరం డివిజన్ పరిధిలో వాల్టా చట్టాన్ని ధిక్కరించి ప్రతి రోజు కొన్ని వేల చెట్లను అక్రమంగా నరికివేస్తున్నారని, అటువంటి వారిపై కఠినచర్యలు తీసుకోవాలని పర్యావరణవేత్త డాక్టర్ భాస్కర్‌నాయుడు ఆర్డీఓ మహేశ్‌ను విన్నవించారు. ఈ మేరకు ఆయన మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. అక్రమంగా చెట్లను నరికివేసి.. వాటిని ఇటుక బట్టీలకు, సామిల్లులకు, పక్కరాష్ట్రాలకు తరలిస్తు సొమ్ము చేసుకుంటున్నార న్నారు. వాల్టా చట్టాన్ని దిక్కరించి కళ్లెదుటే చెట్లను నరికివేస్తున్నా.. అటవీశాఖ అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదన్నారు. ఆర్డీఓ మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా అక్రమంగా నిల్వలు ఉంచిన సామిల్లులను సీజ్ చేస్తామని పేర్కొన్నారు.

ముగిసిన ఉత్సవాలు

పుట్టపర్తి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): శ్రీపోతలయ్య, చెన్నకేశవ, బంగారు లింగమయ్య స్వామి ఉత్సవాలను మంగళవారంతో ముగిశాయి. ఆఖరిరోజు పెద్దకమ్మవారిపల్లి చింతతోపులో భక్తులు జ్యోతులు, బోనాలతో పూజలు నిర్వహించారు. అనంతరం పోతలయ్య స్వామికి జాతర, గావులను చేపట్టారు. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

వైద్య శిబిరానికి స్పందన

ధర్మవరం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): స్థానిక స్పందన ఆస్పత్రిలో మంగళవారం ఉచిత న్యూరాలజీ వైద్యశిబిరాన్ని నిర్వహించారు. న్యూరాలజీ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, వైద్యులు బషీర్, సోనియా ఈ శిబిరంలో 180 మందికి వైద్య సేవలు అందించారు.

పంట రుణాలు రెన్యువల్ చేసుకోండి

ధర్మవరంరూరల్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్లూరు సొసైటీ సహకార బ్యాంకులో పంటరుణాలు తీసుకున్న రైతులు ఈనెల 20లోపు కేవలం వడ్డీ మాత్రమే చెల్లించి.. రెన్యువల్ చేసుకోవాలని ఆ బ్యాంకు సీఈఓ నారాయణస్వామి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పంటరుణాలు రెన్యువల్ చేసుకుంటే ప్రభుత్వ రాయితీలు పొందవచ్చున్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

యూటీఎఫ్.. పార్టీలకు అతీతం

ధర్మవరం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్.. రాజకీయ పార్టీలకు అతీతమని, తాము ఏ పార్టీకి మద్దతు తెలపలేదని రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి స్పష్టం చేశారు. ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు యూటీఎఫ్‌కు వైసీపీ ముసుగు వేయడం సరికాదన్నారు. మంగళవారం ఆయన స్థానిక మీడియాతో మాట్లాడుతూ.. కూటమికి బహిరంగంగా మద్దతు పలికిన అభ్యర్థి ఓడిపోయారని, ప్రభుత్వం విద్యారంగంలో అనుసరిస్తున్న విధానాలకు అది ఒక చెంపపెట్టు అని అన్నారు. ఈ ఎన్నికల్లో పీడీఎఫ్ స్వతంత్రంగా పోటీ చేసిందని, దానికి యూటీఎఫ్, ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలు, ప్రజాసంఘాలు మద్దతు తెలిపాలని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా నాయకులు రామకృష్ణనాయక్, నాయకులు హరికృష్ణ, సాయిగణేశ్, బిల్లేరామాంజినేయులు,లక్ష్మయ్య, రాంప్రసాద్, రామాంజినేయులు, హరిశంకర్, ప్రదీప్‌కుమార్, వెంకటకిశోర్ పాల్గొన్నారు.

నేడు స్థూపం ఆవిష్కరణ

కదిరిఅర్బన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): సీపీఎం సీనియర్ నాయకుడు బడా సుబ్బిరెడ్డి స్వగ్రామమైన కదిరి రూరల్ పరిధిలోని వరిగిరెడ్డిపల్లిలో బుధవారం స్థూపం ఆవిష్కరణ సభ నిర్వహిస్తున్నట్లు పట్టణ కార్యదర్శి జీఎల్ నరసింహులు ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాంభూపాల్, సీనియర్ నాయకులు ఓబులు హాజరవుతారన్నారు. పార్టీ సభ్యులు, వామపక్ష సానుభూతిపరులు, ప్రజలు హాజరుకావాలని కోరారు.

నిరాధార ఆరోపణలు తగవు

ముదిగుబ్బ, మార్చి4(ఆంధ్రజ్యోతి): తన రాజకీయ ఎదుగుదలను ఓర్చుకోలేకే తనపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని, భౌతిక దాడులకు దిగుతున్నారని ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ అన్నారు. ముదిగుబ్బ మండలం బి.కొట్టాల గ్రామంలోని తన నివాసంలో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. కియా వద్ద భూముల విషయంలో అసత్య ఆరోపణలు చేస్తున్నారని, అడవి బ్రాహ్మణపల్లి తండాలో భూములు గిరిజనుల సాగులో ఉంటే వాటిని వారికే అప్పగిస్తామన్నారు.

కొత్త చట్టాలపై అవగాహన

నల్లమాడ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మోటార్ వాహన కొత్తచట్టాలపై సీఐ నరేంద్రరెడ్డి ప్రజలకు స్థానిక సర్కిల్ కార్యాలయంలో మంగళవారం అవగాహన కల్పించారు. రూల్స్ అతిక్రమిస్తే.. భారీ జరిమానా తప్పదని హెచ్చరించారు.

పీఎండీఎస్‌తో భూసారం పెంపు

గాండ్లపెంట, మార్చి 4(ఆంధ్రజ్యోతి): పీఎండీఎస్ (ప్రి మాన్‌సూన్ డ్రై సోవింగ్) ద్వారా భూసారాన్ని పెంచుకోవచ్చని ఐసీఆర్‌పీ డీపీఎం దామోదర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వేపరాల పంచాయతీలోని సీఎం తండాలో మంగళవారం నిర్వహించిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఎండీఎస్ వల్ల 25 రకాల జీవ వైద్యపంటలతో జీవామృతం కలిసి విత్తుకోవడం వలన వానపాములు వృద్ధి చెందుతాయన్నారు. భూమిలో వేడి తగ్గి పంటలు అనుకూలంగా పండుతాయన్నారు. దీని వలన కలుపు శాతం తగ్గుతుందన్నారు. ఈకార్యక్రమంలో రైతులు తిరుపాల్‌నాయక్, రామమోహన్‌నాయక్, శివయ్య, నరేంద్రరెడ్డి, ఐసిఆర్‌బి విజయ్‌కుమార్, విద్యారాణి, సుధాకర్, రైతులు పాల్గొన్నారు.

జనసేన జెండా ఏర్పాటు కోసం స్థలం కేటాయింపు

గాండ్లపెంట, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జనసేన పార్టీ జెండాను ఏర్పాటు చేయడానికి మంగళవారం స్థలాన్ని రెవెన్యూ అధికారులు కేటాయించారు. జనసేన మండల నాయకుడు రవినాయక్ మాట్లాడుతూ.. గతంలో జనసేన జెండాను ఏర్పాటు చేయడానికి స్థలాన్ని కేటాయించాలని వినతిపత్రం అందించామన్నారు. ఆయన వినతి మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద స్థలాన్ని జెండా ఏర్పాటు కేటాయించారన్నారు.

సత్యసాయి జయంత్యుత్సవాలకు రండి


లీలాసాహిర్ అహ్మద్‌ను ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

పుట్టపర్తి రూరల్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శత జయంత్యుత్సవాలకు పుట్టపర్తికి విచ్చేయాలని కెనడా సాంస్కృతిక భౌగోళిక మహిళా సాధికారత మాజీ మంత్రి లీలాసాహిర్ అహ్మద్‌ను ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి ఆహ్వానించారు. మంగళవారం అమరావతిలోని ఉండవల్లి శాసనసభ హాల్‌కు విచ్చేసిన కెనడా మాజీ మంత్రిని ఎమ్మెల్యే కలిసి.. ఆహ్వానించారు. పుట్టపర్తికి తప్పక వస్తాననీ, సత్యసాయి బాబా మహాసమాధిని దర్శించుకుంటానని ఆమె తెలిపారు.

జూదరుల అరెస్ట్

కదిరిఅర్బన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యాలచెరువు సమీపంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని మంగళవారం అరెస్ట్ చేసినట్లు అర్బ్ గ్రేడ్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. వారి నుంచి రూ.1,05,500తోపాటు రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వారిని కోర్టుకు హాజరు పరిచామన్నారు. ఈదాడిలో ఎస్ఐ రమణారెడ్డి, ఏఎస్ఐ రామక్రిష్ణ, కానిస్టేబుల్ రాజశేఖర్, వెంకటరాముడు, సిబ్బంది పాల్గొన్నారు.


రాతి బండపై కాలువను దాటుతున్న ఓ మహిళ

తవ్వారు.. వదిలేశారు..!

ఇళ్లలోకి వెళ్లలేక పాట్లు.. 20 రోజులుగా ఇదే పరిస్థితి


కాలువ కోసం తవ్వి.. వదిలేసిన దృశ్యం

ఓబుళదేవరచెరువు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాలడెయిరీ వెనుకవైపున మురుగు కాలువల నిర్మాణం కోసం 20 రోజుల క్రితం ఇలా తవ్వారు. అనంతరం అటువైపు కన్నెత్తి చూడలేదు. దీంతో ఆ ప్రాంతవాసులు ఇళ్లలోకి వెళ్లడానికి తాత్కాలికంగా బండలు, చెక్కలు వేసుకున్నారు. వృద్ధులు, మహిళలు, చిన్నారులు వాటిని దాటే సమయంలో కిందపడి గాయపడుతున్నారు. రాత్రి వేళల్లో మరీ ఇబ్బందిగా ఉంటోంది. ఏ మాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా.. గాయపడక తప్పదని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి... ఈ పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్‌ను వివరణ కోరగా.. వీధులను కొందరు ఆక్రమించారని, దీంతో కొన్ని సాంకేతిక సమస్యలు ఏర్పడ్డాయని అన్నారు. త్వరలోనే ఆ సమస్యలు పరిష్కరించి కాలువ నిర్మాణాలు పూర్తి చేస్తామని, లేకుంటే తీసిన గుంతలను పూడ్చివేస్తామని స్పష్టం చేశారు.


విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న సభ్యులు

విద్యాసామగ్రి పంపిణీ

ఓబుళదేవరచెరువు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): స్థానిక కేజీబీవీలోని 35 మంది, తుమ్మలకుట్లపల్లి జిల్లాపరిషత్ పాఠశాలలోని 40 మంది టెన్త్ విద్యార్థులకు హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు రూ.16 వేల విలువైన విద్యాసామగ్రిని మంగళవారం అందించారు. ఇందులో సభ్యులు ఫయాజ్, ముస్తక్, పోస్టల్ వసీమ్, ఇర్షాద్, ఇస్మాయిల్, ఇమ్రాన్, సయ్యద్, ఇమామ్ బాషా పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

పుట్టపర్తి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణపల్లిలో ప్రధాన రోడ్డు పక్కనే చిన్నగోడపై ట్రాన్స్‌కో అధికారులు ఇలా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. సాధారణంగా దిమ్మెను ఏర్పాటు చేసి లేక స్తంభానికి ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలి. కాని అధికారులు ఇలా పిట్టగోడపై.. తక్కువ ఎత్తులో ఏర్పాటు చేశారు. దీనిపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌కో అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

గోడ మీద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ →



పరీక్షలు రాసేందుకు కాగితాల్లేవ్

కొత్తచెరువు బాలుర ఉన్నత పాఠశాల దుస్థితి


తెచ్చుకున్న తెల్ల కాగితాలను చూపుతున్న విద్యార్థులు

కొత్తచెరువు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం విద్యార్థుల సామర్థ్యాన్ని గుర్తించేందుకు ఎఫ్ఏ-1, ఎఫ్ఏ-2, ఎఫ్ఏ-3, ఎఫ్ఏ-4 పరీక్షలను నిర్వహిస్తోంది. ప్రభుత్వం ప్రశ్నాపత్రాలను సరఫరా చేస్తోంది. ఆ పరీక్షలు రాయడానికి పాఠశాల ద్వారా తెల్లకాగితాలను విద్యార్థులకు అందించాల్సి ఉంది. కొత్తచెరువు బాలుర ఉన్నత పాఠశాలలో మాత్రం విద్యార్థులే తెల్లకాగితాలను తీసుకొని వెళ్తున్నారు. ఈ విషయంపై మంగళవారం స్థానిక పాఠశాలకు వెళ్లి పరిశీలించగా.. ఎఫ్ఏ-4 పరీక్షలకు ప్రశ్నాపత్రాలు ఇచ్చారు కానీ.. జవాబులు రాయడానికి తెల్లకాగితాలు ఇవ్వలేదని విద్యార్థులు తెలిపారు. దీంతో తాము బయట నుంచి నోట్ పుస్తకాలలోని పేపర్లను చింపుకుని పరీక్షలు రాస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం పాఠశాల నిర్వహణకు ప్రభుత్వం నిధులను సైతం అందిస్తోంది. ఆ నిధులను పాఠశాల అభివృద్ధికి కానీ.. విద్యార్థుల పరీక్షల నిర్వహణకు ఉపయోగించాల్సి ఉంటుంది. అయితే ఆ డబ్బులు ఏం చేస్తున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. దీనిపై పాఠశాల హెచ్ఎం వాణిబాయ్‌ని వివరణ కోరగా... ప్రతి పరీక్షకు తామే పాఠశాల ద్వారానే తెల్లకాగితాలను విద్యార్థులకు అందిస్తున్నామని, ఈరోజు 10వ తరగతి పరీక్షలపై సమావేశం ఉండటంతో తెల్లకాగితాలు అందించలేకపోయామని తెలిపారు.

బాల్యవివాహాలను అరికడదాం: ఐసీడీఎస్ పీడీ

ఓబుళదేవరచెరువు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలను అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ వరలక్ష్మీ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక షాదీమహల్‌లో అమడగూరు, నల్లమాడ, ఓడీసీ మండలాల అంగవాడీ కార్యకర్తల సమావేశం, అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో పీడీ మాట్లాడుతూ.. ఇటీవల బాల్యవివాహాలు అధికమవుతున్నాయని, వాటిని అడ్డుకునేలా గ్రామస్థులను చైతన్యం చేయాలని సూచించారు. ఈనెల 8వ తేదీ వరకు మహిళ దినోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కాగా, ప్రాజెక్టుల వారీగా నిర్వహించిన ఆహార ప్రదర్శన ఆకట్టుకుంది. ఇందులో పోషకాలు అందించే చిరుధాన్యాలు, కూరగాయలు, ఆకుకూరలు, పప్పుదినుసులు, పండ్లు తదితర వాటిని ప్రదర్శించారు. కార్యక్రమంలో డీసీపీఓ మహేష్, ఇంటిగ్రేటెడ్ చైల్డు ప్రొటెక్షన్ సర్వీస్ నాగలక్ష్మీ, జిల్లా కో-ఆర్డినేటర్ సుదేష్‌వర్మ, సూపర్‌వైజర్లు విజయకుమారి, సత్యవతి, గంగాదేవి, బ్లాక్ కో-ఆర్డినేటర్ లక్ష్మీ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ వరలక్ష్మి

కార్పొరేషన్లకు పూర్వవైభవం

స్వయం ఉపాధికి కూటమి చేయూత

నిరుద్యోగ యువతకు సబ్సిడీ రుణాలు

వైసీపీ హయాంలో నిర్వీర్యం

కొత్తచెరువు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. కుల కార్పొరేషన్లకు పూర్వ వైభవం తెచ్చేలా పాలన సాగించింది. వైసీపీ ప్రభుత్వం వివిధ కుల కార్పొరేషన్లకు చైర్మన్లను మాత్రమే నియమించి.. చేతులు దులుపుకుంది. నాటి సీఎం జగన్‌రెడ్డి ప్రతి మాటకు ' నా బీసీ.. నా ఎస్సీ.. నా ఎస్టీ.. ' అంటూ ఊదరగొట్టడమే తప్ప.. ఏ ఒక్క కార్పొరేషన్‌కూ రూపాయి కూడా ఇవ్వలేదు. దీంతో కార్పొరేషన్లు కేవలం అలంకార ప్రాయంగా మారాయి. నిధులు లేనప్పుడు తమకు ఈ పదవులు ఎందుని ఏకంగా చైర్మన్‌లే విమర్శించిన సందర్భాలు లేకపోలేదు. దీంతో నిరుద్యోగ యువతకు సబ్సిడీ రుణాలు అందక తీవ్రంగా నష్టపోయారు. కూటమి అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల్లోనే వివిధ కుల కార్పొరేషన్లకు నిధులు కేటాయించింది. ఆయా కార్పొరేషన్ల పరిధిలోని నిరుద్యోగ యువతకు సబ్సిడీతో కూడిన రుణాలను అందించేలా చర్యలు తీసుకుంది. నిరుద్యోగ యువత నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించి.. ఇంటర్వ్యూలు నిర్వహించి.. అర్హులను గుర్తించి.. రుణాలు మంజూరు చేసింది.

● మంజూరైన యూనిట్లు ఇవే

సత్యసాయి జిల్లాలోని ఆయా కుల కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి, జనరిక్ మందుల దుకాణాలకు, బృంద (గ్రూపు) వ్యాపారాలకు రుణాలను అందిస్తోంది. ఇందులో బ్యాంకు ద్వారా 50 శాతం రుణం, మిగిలిన 50 శాతం రుణం ప్రభుత్వం సబ్సిడీ కింద అందిస్తోంది. బీసీ కార్పొరేషన్ కింద జిల్లాకు రూ.2, 3, 5 లక్షల స్వయం ఉపాధి యూనిట్లు 1,472 మంజూరయ్యాయి. వీటికి 13,867 మంది దరఖాస్తులు చేసుకున్నారు. శాలివాహనకు మూడు నుంచి ఐదుగురు ఉన్న గ్రూపులకు (కుల వృత్తుల) 132 యూనిట్లు మంజూరు కాగా వాటికి 117 దరఖాస్తులు వచ్చాయి. ఈబీసీకి 86 యూనిట్లుకుగాను 399 దరఖాస్తులు, కమ్మ కార్పొరేషన్‌కు 49 యూనిట్లకు 235 దరఖాస్తులు, రెడ్డి కార్పొరేషన్‌కు 24 యూనిట్లకు 229 దరఖాస్తులు, వైశ్య కార్పొరేషన్‌కు 17 యూనిట్లకు 190 దరఖాస్తులు, బ్రాహ్మణ కార్పొరేషన్‌కు 11 యూనిట్లకు 42 దరఖాస్తులు, కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాల కార్పొరేషన్‌కు రూ. 2,3,5 లక్షల 345 యూనిట్లకుగాను 2 వేల దరఖాస్తులు వచ్చాయి. ఇందులో కాపు కార్పొరేషన్ కింద ఐదుగురు ఉన్న బృంద (గ్రూపు)కు చిన్నతరహా పరిశ్రమల కింద ఐదు యూనిట్లు మంజూరయ్యాయి. వీటికి ఏడు దరకాస్తులు రాగా ఒక్క యూనిట్ వలువ 25 లక్షలు, ఇందులో 10 లక్షలు బ్యాంక్ లోన్, 10 లక్షలు ప్రభుత్వం సబ్సిడీ, రూ.5 లక్షలు గ్రూపు సభ్యులు వాటా కింద చెల్లించాల్సి ఉంటుందని బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రమణ్యం తెలిపారు.

● జనరిక్ మందుల దుకాణాలకు...

సత్యసాయి జిల్లాలో జనరిక్ మందుల దుకాణాలకు ఏర్పాటుకు 62 యూనిట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. వీటికి బి ఫార్మసీ చేసిన వారు అర్హులు. ఒక్క యూనిట్ విలువ రూ. 8 లక్షలు. ఇందులో బ్యాంక్ లోన్ కింద రూ.4 లక్షలు.. ప్రభుత్వం వాటా రూ.4 లక్ష సబ్సిడిని అందించనుంది. బీసీ కులాలకు 30 యూనిట్లు మంజూరు కాగా.. వీటికి 63 మంది దరఖాస్తులు చేసుకున్నారు. కమ్మ, కాపు, రెడ్డి, బ్రాహ్మణ, ఆర్యవైశ్య కుల కార్పొరేషన్లకు 32 యూనిట్లు మంజూరకాగా వీటికి నాలుగు దరఖాస్తులు మాత్రమే వచ్చాయని బీసీ కార్పొరేషన్ ఈడీ తెలిపారు.


దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

క్రైం న్యూస్..

పాన్ షాపు నిర్వాహకుడి ఆత్మహత్య


మహబూబ్ బాషా మృతదేహం

బత్తలపల్లి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): స్థానికంగా పాన్ షాపు పెట్టుకొని జీవనం సాగించే మహబూబ్‌బాషా (30) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతనికి భార్య బానుబేగం, కుమారుడు ఉన్నారు. ఇతను రోజూ మద్యం సేవించేవాడు. రంజాన్ మాసం ప్రారంభమైనా.. మద్యం సేవిస్తుండడంతో అతని భార్య, తల్లిదండ్రులు సోమవారం రాత్రి మందలించారు. దీంతో అతను జీవింతంపై విరక్తి చెందాడు. అర్ధరాత్రి అతని కుమారుడు ఏడుస్తుండడంతో.. బానుబేగం ఆ బాలుడిని ఎత్తుకొని గది బయటకు వెళ్లింది. కొద్ది సేపు అనంతరం ఆమె తిరిగి రాగా.. మహబూబ్‌బాషా ఉరికి వేలాడుతూ కనిపించాడు. దీంతో బానుబేగం గట్టిగా కేకలు వేయడంతో చుట్టు పక్కలవారు, బంధువులు వచ్చి మహబుబ్‌బాషాను వెంటనే ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. కాగా, అప్పటికే అతను మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కేసు దర్యాప్తులో ఉంది.

అనారోగ్యంతో మున్సిపల్ వర్కర్...

ధర్మవరం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేతిరెడ్డికాలనీలో నివాసముంటున్న మున్సిపల్ వర్కర్ లక్ష్మీదేవి (34) అనారోగ్యంతో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. లక్ష్మీదేవి పలు అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతోంది. దీనికి కుటుంబ కలహాలు కూడా తోడయ్యాయి. దీంతో జీవితంపై విరక్తి చెందిన ఆమె సోమవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఇంటి సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. మంగళవారం ఉదయం కీమన్ మహిళ మృతదేహం పడి ఉండటాన్ని గమనించి.. హిందూపురం జీఆర్పీ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వారు సంఘటన స్థలానికి చేరుకొని.. మృతురాలిని లక్ష్మీదేవిగా గుర్తించి.. ఆమె కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉందని హిందూపురం రైల్వేహెడ్‌కానిస్టేబుల్ ఎర్రిస్వామి తెలిపారు. కాగా, లక్ష్మీదేవికి భర్త కుళ్లాయప్ప, కుమార్తె మీనాక్షి, కుమారుడు పురుషోత్తం ఉన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ధర్మవరంరూరల్, మార్చి4(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటతిమ్మాపురం గ్రామంలో గుజ్జల చిన్ననారాయణ (51) విద్యుదాఘాతంతో మంగళవారం రాత్రి మరణించాడు. ఆయన సెల్‌ఫోన్‌కు ఛార్జింగ్ పెట్టేందుకు బాత్రూం వద్ద వెళ్లగా.. అక్కడ ఉన్న హీటర్ తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే అతడిని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు. చిన్ననారాయణకు భార్య ఈరమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

చిల్లర దుకాణంలో అగ్నిప్రమాదం

రూ.4 లక్షలు నష్టం


కాలిపోయిన సరుకులు

తనకల్లు, మార్చి4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏనుగుండుతండాలో రమణ నాయక్‌కు చెందిన చిల్లర దుకాణం ఉంది. మంగళవారం మధ్యాహ్నం ఆ దుకాణంలో ఎవరు లేని సమయంలో విద్యుదాఘాతంలో మంటలు చెలరేగాయి. గ్రామస్థులు అప్రమత్తమై ఆ మంటలను ఆర్పారు. అప్పటికే ఈ ప్రమాదంలో రూ. మూడు లక్షల నగదు, రూ.లక్ష సరుకులు కాలిపోయాయి. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని బాధితుడు విజ్ఞప్తి చేస్తున్నాడు.

విద్యార్థినులకు చట్టాలపై అవగాహన


విద్యార్థినులతో మాట్లాడుతున్న మహిళా పీఎస్ డీఎస్పీ

పుట్టపర్తి రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా మహిళా చట్టాలపై మండలంలోని జగరాజుపల్లి మంగళకర డిగ్రీ కళాశాలలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పుట్టపర్తి మహిళా పీఎస్ డీఎస్పీ ఆదినారాయణ మహిళా చట్టాలు, పోక్సో యాక్ట్, సామాజిక మాధ్యమాల్లో మహిళలపై వేధింపులు, సైబర్ నేరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అత్యవసర సమయాల్లో సహాయం కోసం చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబరు 1098, ఉమెన్ హెల్ప్‌లైన్ నెంబరు 181, పోలీసు హెల్ప్‌లైన్ నెంబరు 100/112, సైబర్‌క్రైం హెల్ప్‌లైన్ నెంబరు 1930 నెంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

చావిడి నిర్మాణానికి రూ.75 వేలు విరాళం


విరాళం అందజేస్తున్న దృశ్యం

తనకల్లు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోళ్లవారిపల్లి దళితవాడలోధనకొండ గంగమ్మ చావిడి నిర్మాణానికి పారిశ్రామిక వేత్త ఎంజిరెడ్డి రూ.75వేల ఆర్థికసాయం అందించారు. మంగళవారం ఆ నగదును యువనాయకుడు సమరసింహారెడ్డి చేతుల మీదుగా గ్రామస్థులకు అందించారు. ఇందులో తనకల్లు సర్పంచ్ సరస్వతి, నాయకులు రామక్రిష్ణ, రమణప్ప, పెద్దప్ప, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం

పుట్టపర్తి రూరల్: కొత్తచెరువు మండలానికి చెందిన హోంగార్డు చెన్నప్ప గత జూలై 15న అనారోగ్యంతో మరణించాడు. దీంతో ఆయన కుటుంబానికి హోంగార్డు వెల్ఫేర్ ఫండ్ కింద రూ. 15 వేలు మంజూరైంది. ఆ చెక్‌ను ఎస్పీ రత్న.. చెన్నప్ప భార్య చంద్రకళకు మంగళవారం తన క్యాబిన్‌లో అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ వలి, హోంగార్డు ఇన్‌చార్జి రామాంజనేయులు పాల్గొన్నారు.



హోంగార్డు కుటుంబానికి చెక్ అందిస్తున్న ఎస్పీ రత్న

న్యూస్ బాక్స్

రైల్వే స్టేషన్ రోడ్డుకు మహర్దశ



రైల్వే స్టేషన్‌కు వెళ్లేదారిలో ఆక్రమణలు తొలగించిన దృశ్యం

చంద్రమౌళి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత చొరవతో పెనుకొండ పట్టణంలోని రైల్వే స్టేషన్‌కు వెళ్లే రహదారికి మహర్దశ వచ్చింది. దాదాపు రూ.50లక్షలతో 450మీటర్ల సీసీ రోడ్డు పనులకు పూనుకున్నారు. మంగళవారం రైల్వే స్టేషన్‌కు వెళ్లేదారిలో ఉన్న ఆక్రమణలను తొలగించారు. ఈ దారి ఇరుకుగా ఉండటంతో ఆటోలో వెళ్లి వచ్చే ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతుండేవారు. పెనుకొండ అభివృద్ధిలో భాగంగా 40అడుగుల రోడ్డును ఏర్పాటు చేయిస్తున్నారు. దీంతో స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆగ్రోఫామ్స్‌కు నోటీసు



అగ్రోఫామ్‌హౌస్

లేపాక్షి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): చోళసముద్రం పంచాయతీ సర్వేనంబరు 333/9 సర్వేనంబరులో ఎటువంటి అనుమతులు లేకుండా వ్యవసాయ భూమిలో వ్యవసాయేతర భవనాలు నిర్మించి రెస్టారెంట్ కలాపాలు నిర్వహిస్తున్నారని తహసీల్దార్ సౌజన్యలక్ష్మికి మండల ప్రజలు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ అగ్రిఫామ్‌హౌస్‌ను మంగళవారం తనిఖీ చేసి ఇందులో ఎటువంటి అనుమతులు లేకుండా వ్యవసాయేతర పనులు నిర్వహిస్తున్నట్లు నిర్ధారించారు. వెంటనే అన్ని కార్యకలాపాలు ఆపి వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చుకోవాలని వారికి నోటీసులు అందించారు. ఐదు రోజుల్లో అనుమతులు తీసుకోకపోతే ఫామ్‌హౌస్‌ను సీజ్ చేయడంతోపాటు కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె సిబ్బందికి హెచ్చరించారు. ఆమె వెంట పంచాయతీ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

మండల సమాఖ్య అధ్యక్షురాలిగా శ్రీదేవి

గోరంట్ల, మార్చి 4(ఆంధ్రజ్యోతి):మహాలక్ష్మి గోరంట్ల మండల సమాఖ్య అధ్యక్షురాలుగా పట్టణానికి చెందిన శ్రీదేవి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. మండల సమాఖ్య అధ్యక్ష స్థానం ఎంపిక కోసం వెలుగు కార్యాలయంలో ఏపీఎం నాగమణి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. మండలంలోని డ్వాక్రా సంఘాల లీడర్లు హాజరయ్యారు. గోరంట్ల శాంతి మహిళ సంఘం నాయకురాలు శ్రీదేవి ఈ స్థానానికిపోటీపడగా ఆమెను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ.. బీసీ సంక్షేమ శాఖామంత్రి సవిత, ఎంపీ పార్థసారధి స్థానిక టీడీపీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని మహిళ సంఘాలతోపాటు ప్రభుత్వ అధికారులతో కలిసి మెలసి పనిచేస్తూ సమాఖ్య అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానన్నారు.

క్వార్టర్స్ నిర్మాణానికి స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ, ఎస్ఐ

సోమందేపల్లి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): సోమందేపల్లి పోలీస్ స్టేషన్ ఎదుట ప్రభుత్వ స్థలంలో క్వార్టర్స్, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి మంగళవారం డీఎస్పీ వెంకటేశ్వర్లు ఎస్ఐ రమేష్‌తో కలిసి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న సిబ్బంది కోసం క్వార్టర్స్ నిర్మాణానికి నిధులు మంజూరైనాయన్నారు. అదేవిధంగా కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ అంచనా వ్యయాన్ని రూపొందించే సమయంలో స్థల పరిశీలన చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యతను పెంచండి

హిందూపురం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత మరింత పెంచాలని మునిసిపల్ ఛైర్మన్ డీఈ రమేష్ అన్నారు. మంగళవారం శ్రీకంఠపురంలో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో హిందూపురానికి విరివిగా నిధులు వస్తాయని కాంట్రాక్టర్లు లాభాపేక్షతోకాకుండా పనుల్లో నాణ్యత పెంచి పట్టణ అభివృద్ధికి తోడ్పాటునందించాలన్నారు. ఆయనవెంట కౌన్సిలర్ గిరి, నాయకులు నవీన్, లింగప్ప, మునిసిపల్ డీఈ వాణి, ఏఈ ధీరజ్, తదితరులు పాల్గొన్నారు.

ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

అగళి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): 2025-26సంవత్సరానికి అగళి మోడల్ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ జాఫర్ కోరారు. ఏప్రిల్ 20న పరీక్షలు నిర్వహించి మెరిట్ ప్రకారం తీసుకోవడం జరుగుతుందన్నారు. 5వ తరగతి చదువుతూ 6వ తరగతి ప్రవేశానికి అర్హతగల ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రుల ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రైతు సమస్యలను వెంటనే పరిష్కరించాలి

సోమందేపల్లి, మార్చి 4(ఆంధ్రజ్యోతి) : రైతు సమస్యలను వెంటనే పరిష్కరించాలని రైలు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హరి తెలిపారు.మంగళవారం రైతు సమస్యలపై ఆయన స్థానిక నాయకులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం వినతి పత్రం అందించారుఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అవలంభిస్తున్న రైతు వ్యతిరేక విధానంవల్ల ఆత్మహత్యలు, వలసలు పెరిగిపోతున్నాయన్నారు. పంటలు గిట్టుబాటు కల్పించి బీమా సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. పట్టు రైతుల ప్రోత్సాహకాల బకాయిలు రూ.72కోట్లు వెంటనే విడుదల చేయాలన్నారు. వ్యవసాయ మోటార్లకు, స్మార్ట్‌మీటర్లు బిగించకుండా, ట్రాన్స్‌ఫార్మర్ ధరలు తగ్గించాలన్నారు. విద్యుత్ చార్జీలను రైతులపై బారం పడకుండా చూడాలన్నారు. పాడిరైతులకు పాలు గిట్టుబాటు ధర, పశుగ్రాసం, దాణ, వైద్య సౌకర్యాలు ప్రభుత్వమే భరించాలన్నారు. హంద్రీనీవా కాలువను వెడల్పుచేసి అన్ని చెరువులకు నీరందించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, రాజగోపాల్, లక్ష్మీనారాయణ, రామాంజనేయులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా సైన్స్ ప్రయోగాలు

- వైసీపీ హయాంలో పూర్తికాని నాడు-నేడు పనులు
- ఇప్పటికీ పాఠశాలల్లో ల్యాబ్‌లు కరువు

హిందూపురం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): చాలాభాగం ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు నేటికీ ల్యాబ్ అంటే ఏంటో తెలియదు. ఒకవేళ ల్యాబ్ ఉన్నా, అక్కడ పరికరాలు, రసాయనాలు ఉండవు. ఇవ్వన్నీ ఉన్నా అక్కడ ప్రయోగాలు ఎలా చేయాలో చెప్పేవారు ఉండరు. ఈ పరిస్థితినంతా మార్చేస్తామని స్కూళ్లను బలోపేతం చేస్తామని వైసీపీ ప్రభుత్వం నాడు నేడు పేరుతో హంగామా చేసింది. కానీ విద్యార్థులకు కావల్సిన సైన్స్ పరికరాలు, అందుకు తగ్గట్టు ఉపాధ్యాయులను సమకూర్చడంలో విఫలమయింది. అవసరమైన పరికరాలు లేకపోవడంతో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో సైన్స్ ప్రయోగాలు అంతంతమాత్రంగానే సాగుతున్నాయి. సర్కారు బడులను కార్పొరేట్ స్థాయికి పెంచి, నిరుపేద విద్యార్థులకు కంప్యూటర్ శాస్త్ర సాంకేతిక బోధనలు అందించేందుకు కృషిచేస్తామని చెప్పిన పాలకులు ఆచరణలో ఆసక్తిచూపడం లేదన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. దీనివల్ల పలు పాఠశాలల్లో సైన్స్ విద్య అందని ద్రాక్షగా మారింది. దీంతో విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలు ఎలాచేయాలో తెలియక ఇబ్బందిపడుతున్నారు. మెజార్టీ పాఠశాలల్లో ల్యాబ్‌లు లేవన్నది బహిరంగ రహస్యం. ఒకే గదిలో లైబ్రరీ, ల్యాబ్‌లు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. దీంతో విద్యార్థులు సైన్స్ విద్యను పూర్తిస్థాయిలో నేర్చుకోలేకపోతున్నారు. సైన్స్‌ఫెయిర్ అంటూ, సీవీ రామన్ సైన్స్ దినోత్సవం అంటూ మొక్కుబడిగా కార్యక్రమాలు జరుపుకుంటున్నారు. సదుపాయాలు లేకుండా సైన్స్‌ఫెయిర్ అంటూ ఊదరగొట్టడం వలన ప్రయోజనమేముంటుంది.? ఇప్పటికైనా ఉన్నత పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



సైన్స్ డే సందర్భంగా జరిగిన సైన్స్ ఫెయిర్ (ఫైల్)

రేషన్‌షాపుల నిర్వహణపై విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సోమందేపల్లి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): రేషన్‌షాపుల ద్వారా కార్డుదారులకు ఇష్టారీతిన సరుకుల పంపిణీ చేయడంపై మంగళవారం జిల్లా పౌరసరఫరాల అధికారి వంశీ కృష్ణారెడ్డి విచారణ చేపట్టారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'రేషన్ పంపిణీ వివాదాస్పదం' అన్న కథనంపై ఆయన స్పందించారు. ఈ సందర్భంగా సోమందేపల్లిలోని వినాయకనగర్‌లో ఉన్న రేషన్‌షాపు, కొత్తపల్లి, కందికుంట, జూలకుంట గ్రామాల్లోని షాపులను తనిఖీచేశారు. డీలర్లు, కార్డుదారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విలేకరులకు వివరాలు వెల్లడించారు. డీలర్లు, ఎండీయు ఆపరేటర్లు మధ్య సరైన అవగాహన లేని కారణంగా ప్రజలను ఇబ్బంది పెట్టినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీంతో డీలర్, ఎండీయు ఆపరేటర్‌పై చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఏ డీలర్ అయినా నిబంధనలకు వ్యతిరేకంగా నడుచుకోరాదన్నారు. లబ్దిదారులను తప్పుదోవ పట్టించినవారిని ఉపేక్షించేంది లేదన్నారు. ప్రతి ఒక్కరు సమయపాలన విధిగా పాటించాలని ప్రజలను ఇబ్బంది కలిగించకుండా సరుకులు పంపిణీ చేయాలన్నారు. తూకాల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. షాపులకు వచ్చిన వృద్దులకు, వికలాంగులకు చైర్లు ఏర్పాటుచేసి వెంటనే సరుకులు ఇచ్చి పంపాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎండీయూ ఆపరేటర్లు, డీలర్లు నడుచుకోవాలన్నారు. దీనిపై డీలర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మారుతి, సీఎస్‌డీటీ మోహన్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



రేషన్ పంపిణీ వివరాలను తనిఖీ చేస్తున్న డీఎస్ఓ

పరిసరాలను అపరిశుభ్రం చేస్తే చర్యలు

గోరంట్ల, మార్చి4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మసీదు ప్రాంతంలో చికెన్ దుకాణదారులు రోడ్లపై కార్యకలాపాలు సాగిస్తూ, అపరిశుభ్రం చేయడంతోపాటు, రాకపోకలకు అంతరాయం కలిగిస్తుండడంతో పంచాయతీ ఇఓ సుబ్రమణ్యం మంగళవారం ఆప్రాంతంలో పర్యటించారు. రోడ్లపైనే రక్తం, మాసం వ్యర్థాలు, కోళ్ల రవాణా చేసే ఇనుప బాక్స్‌లు ఉంచుతున్నారు. ఈనేపథ్యంలో ఉదయం స్థానికులు చికెన్ దుకాణ దారులను ప్రశ్నించగా, ఘర్షణపడి దూషించినట్లు ఆవేదన చెందారు. దీంతో వారు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈఓతోపాటు పంచాయతీ సిబ్బంది మేస్త్రీ గణేష్, ఆదినారాయణ, ఆప్రాంతానికి వచ్చి దుకాణదారులతో మాట్లాడారు. రోడ్డుపై ఉంచిన రెండు కోళ్లను, ఇనుప బాక్స్‌లను స్వాధీనం చేసుకుని ట్రాక్టర్‌ద్వారా పంచాయతీ కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా మాంసం విక్రయాలకు ప్రత్యేక స్థలం చూపించాలని దుకాణదారులు డిమాండ్ చేశారు.

వైభవంగా కొల్హాపురమ్మ వార్షికోత్సవాలు



సర్వాలంకారాలతో ముస్తాబైన అమ్మవారు

హిందూపురం అర్బన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని శ్రీ కొల్హాపురమ్మ లక్ష్మీ ఆలయంలో 5వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. మూడు రోజులుగా ఆలయంలో వివిధ పూజలు అభిషేకాలు అర్చనలు, హోమాలు నిర్వహించారు. అనంతరం పూలు నగలతో అమ్మవారి మూల విరాట్‌ను సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. వేదపండితుల మంత్రోచ్ఛారణలతో మంగళవాయిద్యాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

చంద్రబాబు, పవన్, బాలయ్యలకు కృతజ్ఞతలు

హిందూపురం అర్బన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో మాట ఇచ్చిన విధంగా బడ్జెట్‌లో నిధులు కేటాయించి న్యాయం చేశారని నాయీ బ్రాహ్మణులు ఆనందం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పట్టణ పరిధిలోని త్యాగరాజనగర్‌లోని సవిత నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు మాట్లాడుతూ ఉచిత విద్యుత్ కొరకు రూ. 450 కోట్లు, ఆదరణ పథకం కింద రూ.వేయి కోట్లు బడ్జెట్‌లో కేటాయించడం హర్షించదగ్గ విషయమన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుందని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయిబ్రాహ్మణ సంఘం పట్టణ అధ్యక్షుడు బిఎస్‌మూర్తి, ఉపాధ్యక్షుడు రమేష్‌బాబు, జిల్లా కార్యదర్శి హరిబాబు, మంజునాథ్ పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో నిరసన



తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న ప్రజలు

గుడిబండ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని జంబలబండ గ్రామానికి చెందిన ప్రజలు తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఖాళీ బిందెలతో ప్రధాన రోడ్డుపై నిరసన కార్యక్రమం చేపట్టారు. తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పంచాయతీ అధికారులు సమస్య పరిష్కరించడంలో విఫలమయ్యారని ప్రజలు ఆరోపించారు. వ్యవసాయ బోరుబావుల వద్దకు వెళ్లి తాగునీటిని తెచ్చుకొని దాహం తీర్చుకొంటున్నామని ప్రజలు వాపోయారు. అధికారులు వెంటనే చొరవ తీసుకొని తాగునీటి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరారు. ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి రోడ్డుపై భైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. దీంతో రోడ్డుపై వెళ్లే వాహనాలు ఎక్కడకక్కడే నిలిచిపోయాయి. వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈవిషయమై పంచాయతీ కార్యదర్శి చక్రవర్తి మాట్లాడుతూ తాగునీటి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

ఆసుపత్రి ముందు భాగంలో వేగంగా డ్రైనేజీ పనులు

పెనుకొండ టౌన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లే దారిలో దుర్వాసన రావడంతో టీడీపీ స్థానిక నాయకులు సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లి డ్రైనేజి నిర్మాణ పనులు చేపట్టారు. మంగళవారం డ్రైనేజీ పనులను కన్వీనర్ శ్రీరాములు, త్రివేంద్ర పర్యవేక్షించారు. దాదాపు రూ.2లక్షలతో పనులు చేపడుతున్నారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పట్టణంలో దాదాపు 30చెత్త కుండీలు ఏర్పాటుచేశామని అందులోనే చెత్త వేయాలని సూచించారు.

నేషనల్ సైన్స్‌డేలో గురుకుల విద్యార్థుల ప్రతిభ



సాధించిన బహుమతులతో విద్యార్థులు

రొళ్ల, మార్చి 4(ఆంధ్రజ్యోతి): కొత్తచెరువులో నిర్వహించిన నేషనల్ సైన్స్‌డే-2025 కార్యక్రమంలో రొళ్ల అంబేడ్కర్ గురుకుల విద్యార్థులు వకృత్వ పోటీ పరీక్షలలో మంచి ప్రతిభ కనపర్చారు. జిల్లాస్థాయిలో విజయభాస్కర్ (8వ తరగతి) ప్రథమస్థానాన్ని, మోహన్ కుమార్(8వ తరగతి) ద్వితీయ స్థానాన్ని సాధించారు. వారితోపాటు రవీంద్రనాథ్‌ఠాగూర్, వినయ్‌కుమార్, హర్షవర్ధన్ పోటీలలో పాల్గొన్నారు. జిల్లా విద్యాధికారి క్రిష్టప్ప చేతుల మీదుగా బహుమతులు అందుకొన్నారు. ఈసందర్భంగా పాఠశాల ఇన్‌ఛార్జి రాజేష్, వైస్‌ప్రిన్సిపల్ రమేష్, ఎస్ఎంసీ చైర్మన్ సుమ జగన్నాథ్ ఉపాధ్యాయ బృందం, విద్యార్థులను అభినందించారు.

వైర్‌లెస్ సెట్‌పై విద్యార్థులకు అవగాహన



వైర్‌లెస్‌సెట్ గురించి అవగాహన కల్పిస్తున్న దృశ్యం

సోమందేపల్లి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థినులకు వెర్‌లెస్ సెట్ వినియోగంపై పోలీసులు అవగాహన కల్పించారు. సెట్‌ను ఎలా పట్టుకోవాలి, ఎలా మాట్లాడాలో డెమో ద్వారా చూపించారు. అనంతరం విద్యార్థుల ద్వారా మాట్లాడించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రమేష్ మాట్లాడుతూ వైర్‌లెస్‌సెట్ ఉపయోగాలు, పోలీస్ స్టేషన్‌లో దాని ఆవశ్యకత గురించి వివరించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ జగన్ పాల్గొన్నారు.

తప్పులతడకగా ఉపాధ్యాయుల సీనియారిటీ లిస్టు

మడకశిర టౌన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ అధికారులు ప్రకటించిన ఉపాధ్యాయుల సీనియారిటీ లిస్టు తప్పుల తడకగా ఉందని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మారుతీ ప్రసాద్, కార్యదర్శి జయకృష్ణలు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డీఎస్సీ ర్యాంక్‌లు కూడా తప్పులుగా ఉన్నాయని, ఇప్పుడు పాఠశాలలో ఎఫ్‌ఏ-4 పరీక్షలు జరుగుతున్నా ఇంటర్, టెన్త్ పరీక్షలు ఉన్నా ఉపాధ్యాయుల సమయాన్ని వృథాకాకుండా ఆయా మండలాల పరిధిలో సీనియారిటీ లిస్టు సవరించడానికి అవకాశం ఇవ్వాలని డిమాండ్‌చేశారు. డిపార్ట్ మెంటల్ టెస్టుల నమోదులో తప్పులు ఉన్నాయని, సీనియారిటీ లెక్కింపులో జూనియర్‌లను సీనియర్‌లుగా, సీనియర్లను జూనియర్లుగా చూపారని, లిస్టు సవరించి ఎవరికీ అన్యాయం జరగకుండా చూడాలన్నారు.

విద్యార్థుల శ్రమదానం



కళాశాల ప్రాంగణంలో శ్రమదానం చేస్తున్న విద్యార్థులు

పెనుకొండ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో మంగళవారం శ్రమదానం చేపట్టారు. ఎన్ఎస్ఎస్ పీఓ ప్రతాప్ ఆధ్వర్యంలో విద్యార్థులు కళాశాల ప్రాంగణంలోని లైబ్రరీ చుట్టుపక్కల చెత్తాచెదారాన్ని తొలగించారు. చెట్లకు పాదులు తీసి నీళ్లు పోశారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు హాజరై ఎన్ఎస్ఎస్ వలంటీర్లు అభినందించారు.

వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడిగా బొక్సంపల్లి రామకిష్టప్ప



బొక్సంపల్లి రామకిష్టప్ప

పెనుకొండ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): సత్యసాయి జిల్లా విశ్వహిందూపరిషత్ జిల్లా అధ్యక్షునిగా పట్టణానికి చెందిన బొక్సంపల్లి రామకిష్టప్పను ఎంపిక చేశారు. నంద్యాలలో రెండ్రోజులుగా జరిగిన విశ్వహిందూపరిషత్ విస్తృతస్థాయి సమావేశాల్లో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా బొక్సంపల్లి రామక్రిష్టప్పను, జిల్లా కార్యదర్శిగా గోశాయి హరిప్రసాద్‌ను నియమించారు. నవీన్‌కుమార్‌ను అనంత విభాగ్ బజరంగదళ్ సంయోజక్‌గా నియమించారు. హరేసముద్రం నరేంద్రకుమార్‌ను జిల్లా కార్యదర్శిగా మురళి మనోహర్‌రెడ్డిని జిల్లా బజరంగదల్ సంయోజక్‌గా నియమించారు. మదుసూధన్‌రెడ్డిని జిల్లా ధర్మప్రచార ప్రముఖ్‌గా, కదిరికి చెందిన సాయిని బజరంగదళ్ సహసంయోజక్‌గా నియమించారు.

ట్రైనీ డీఎస్పీగా ఉదయ పావని

మడకశిరటౌన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ట్రైనీ డీఎస్పీగా ఉదయ పావని మంగళవారం మడకశిర పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. మడకశిర సర్కిల్ పరిధిలో మూడు నెలలపాటు డీఎస్పీగా ఆమె విధులు నిర్వహించనున్నారు. ట్రైనింగ్‌లో భాగంగా మడకశిర సర్కిల్ పరిధిలో విధులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

వేతనాలు చెల్లించాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న తాగునీటి పథకం కార్మికులు

హిందూపురం అర్బన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులకు పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే చెల్లించాలని తహసీల్దార్ వెంకటేష్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్మికులు మాట్లాడుతూ.. 11 నెలల నుంచి జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని ఈ విషయంపై గత నెలలో నిరవధిక సమ్మెలోకి వెళ్లేందుకు ప్రభుత్వానికి నోటీసులు కూడా ఇచ్చామన్నారు. అయితే కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అలిమినేని సురేంద్రబాబు కార్మికులకు మద్దతుగా ఉన్నామని నమ్మబలికి సమ్మె విరమింపచేశారన్నారు. ప్రభుత్వంతో మాట్లాడి మార్చి 3వతేదీ లోపల కార్మికులకు జీతాలు అందేలా చూస్తానన్నారు. లేనిపక్షంలో తాను సొంతంగా అయినా కార్మికులకు జీతాలు అందిస్తానని హామి ఇచ్చారన్నారు. ఇప్పుడు ఆయన కూడా దాటివేసే ధోరణిలో ఉన్నారని ఆగ్ర హించారు.

పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతులు చేపట్టండి

సోమందేపల్లి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పందిపర్తి గ్రామం శివారులో మంగళవారం మంచినీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన బోరు పైప్‌లైన్ లీకేజీ అయినట్లు స్థానికులు తెలిపారు. దీంతో నీరు వృధాగా పోతోందని అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. వేసవి కాలం కావడంతో నీటిఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీయాలి

సోమందేపల్లి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికి తీయడంద్వారా విద్యార్థులు అన్నిరంగాల్లో రాణిస్తారని ఎంపీడీఓ నరేంద్రకుమార్ తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో చదివిన విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు కార్యక్రమాలను విరివిగా చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని విజ్ఞాన్ ప్రైవేట్ పాఠశాలలో చేపట్టిన సైన్స్‌ఫెయిర్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. క్రియేటివ్ మైండ్స్ పేరుతో పాఠశాల కరస్పాండెంట్ మల్లికార్జున కార్యక్రమాన్ని చేపట్టడం మంచిదన్నారు. అనంతరం విద్యార్థులు చేపట్టిన వివిధ రకాల నమూనాల స్టాల్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ ఆంజనేయులు, వైసీపీ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు రమాకాంతరెడ్డి, ఇరిగేషన్ డీఈ లక్ష్మీనారాయణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వరి గడ్డివామికి నిప్పు

మడకశిర రూరల్, మార్చి4(ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని భీమరాయణపల్లి గ్రామ సమీపంలో రైతు సంజీవప్ప గడ్డివామికి మంగళవారం మధ్యాహ్నం గుర్తుతెలియ వ్యక్తులు నిప్పు అంటించారు. స్థానికులు గమనించి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు అప్పటికే సగం గడ్డివామి కాలిపోయిందని రైతు ఆవేదన వ్యక్తంచేశారు పెంచుకొన్న పశువులను వేసవిలో ఎలా కాపాడుకోవాలో అని ఆవేదన వ్యక్తంచేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

సోమందేపల్లి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అశోక్ చీరల ఫ్యాక్టరీ వద్ద జాతీయ రహదారిపై కారు, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి స్వల్పగాయాలైనట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని ఆయన తెలిపారు. గాయపడిన వ్యక్తిని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యాన్ని చూపుతున్న అధికారులు

హిందూపురం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని ఎక్సైజ్ అధికారులు స్వాధీన పరుచుకుని కేసు నమోదుచేసినట్లు ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య తెలిపారు. హిందూపురం మండల పరిదిలోని పోచనపల్లివద్ద మంగళవారం వాహనాల తనిఖీ చేస్తుండగా హిందూపురం చాకలకుంటకు చెందిన రాకేష్ ద్విచక్రవాహనంలో 11మద్యం బాక్సులు తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. మద్యం తరలిస్తున్న ద్విచక్రవాహనాన్ని సీజ్‌చేసి రాకేష్‌ను అరెస్టుచేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎవరైనా మద్యాన్ని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్ఐలు పారూక్, పృత్వి, సతీష్, వెంకటేష్ పాల్గొన్నారు.

నలుగురు జూదరుల అరెస్టు.. నగదు స్వాధీనం

గుడిబండ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని హిరేతుర్పి ఎస్సీ కాలనీ గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి వారి నుండి రూ.51వేలు నగదును స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్ఐ రాజకుళ్లాయప్ప తెలిపారు. పేకాట ఆడుతున్న వారి నుంచి నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మారమ్మ తల్లికి పూజలు

గుడిబండ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గుడిబండలో తుమ్మలమారమ్మ అమ్మవారిని భక్తులు మంగళవారం ప్రత్యేక పూలతో అలంకరించి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అనేక మంది భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.